www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
11 నవంబర్ 2026
సంపుటి:4 సంచిక: 304

విశాల భారతి

తెలుగు దినపత్రిక

గతాన్ని మర్చిపోవద్దు

- గతాన్ని మరిచిపోకుండా పనిచేయాలని డీఎస్పీలకు సూచన
- 112 మంది నూతన డీఎస్పీలతో సీఎం ముఖాముఖి
- బాధితుల సమస్యలను ఓపికగా వినాలని సూచన
- సైబర్ నేరాలు, డ్రగ్స్, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి
- డీఎస్పీలకు విదేశాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడి
- టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనతో నియామకాల్లో పారదర్శకత వచ్చిందని ప్రకటన



విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణ పోలీస్ శాఖలో కొత్త తరం అధికారుల బాధ్యతలు ప్రారంభమయ్యాయి. శిక్షణ పూర్తి చేసుకున్న 112 మంది నూతన డీఎస్పీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సూచనలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. కేవలం ఉద్యోగంలో చేరడం, ఉన్నత హోదా సంపాదించడం మాత్రమే గొప్ప విషయం కాదని, ఆ హోదాకు తగిన న్యాయం చేయడమే అసలైన బాధ్యత అని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా ఏ స్థాయికి ఎదిగినా తాము వచ్చిన నేపథ్యాన్ని మర్చిపోవద్దని యువ అధికారులకు గుర్తుచేశారు. కష్టాలను అధిగమించి, ఎన్నో అవాంతరాలను దాటుకొని ఈ స్థాయికి చేరుకున్న అధికారులు సామాన్య ప్రజల సమస్యలను అర్థం చేసుకోవాలని సూచించారు. రాబోయే మూడు దశాబ్దాల తెలంగాణ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, యువ అధికారుల నిర్ణయాలు, పనితీరే ప్రభుత్వ పాలనకు ప్రతిబింబంగా నిలుస్తాయని చెప్పారు. అంటే పోలీస్ యూనిఫామ్ అనేది కేవలం అధికారానికి గుర్తు కాదు.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యతకు ప్రతీక అనే సందేశాన్ని సీఎం తన మాటల ద్వారా స్పష్టంగా వినిపించారు. పోలీసుల పనితీరుపై ప్రభుత్వ ప్రతిష్ఠ మిగతా 2లో..

చెత్తకుప్పలో కాకతీయ శిల్పసంపద

- జక్కిలేరులో నిర్లక్ష్యానికి గురైన కాకతీయుల నంది
- ముళ్ల పొదల్లో 800 ఏళ్ల చారిత్రక సంపద
- రెండు ముక్కలుగా విరిగిన అరుదైన నల్లరాతి విగ్రహం
- 13వ శతాబ్దపు శిల్పకళను గుర్తించిన పురావస్తు నిపుణులు
- నందిని భద్రపరచాలని గ్రామస్థులకు సూచన

03



పార్లమెంట్‌కు రా..!

- రాహుల్ వ్యాఖ్యలపై రాంచందర్ రావు విమర్శలు
- మోదీ దీపావళి వేడుకలపై రాజకీయ దుమారం
- సైనికుల త్యాగాలను గుర్తించాలంటూ బీజేపీ వ్యాఖ్యలు
- మేధో నక్సలిజంపై రాహుల్ ఘాటు స్పందన

03





అండాల దందాపై మహిళా కమిషన్ సీరియస్

- రూ.30 వేల ఆశచూపి యువతులకు వల
- ఆరు రాష్ట్రాలకు చెందిన 50 మంది బాధితులు
- 90 శాతం పెళ్లికాని యువతులే
- ఐదు ఫెర్టిలిటీ సెంటర్లకు నోటీసులు
- ఆధార్ ఫోర్జరీ, వైద్య నిబంధనల ఉల్లంఘన
- ప్రధాన నిందితుడు హుస్సేన్ కోసం గాలింపు

03



షేక్ హసీనాకు మరణశిక్షే

- షేక్ హసీనాకు మరణశిక్ష తప్పదన్న బంగ్లాదేశ్
- కొత్త పాస్‌పోర్ట్ జారీకి అవకాశం లేదని స్పష్టం
- ప్రయాణ పత్రాలు కూడా ఇవ్వబోమని ప్రకటన
- హసీనా తరఫున పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు
- 2024 ఆగస్టు నుంచి భారత్‌లోనే హసీనా ఆశ్రయం
- హింసాత్మక అణచివేత కేసులో హసీనాకు మరణశిక్ష విధింపు

03

కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పి!

పీఆర్సీ నివేదిక పై ఉద్యోగుల ఎదురుచూపులు

- 51 శాతం ఫిట్‌మెంట్ కోసం డిమాండ్
- రూ.10 వేల కోట్ల బిల్లులు పెండింగ్
- ఓపీఎస్ అమలుకు ఉద్యోగుల పట్టుబాటు
- దీపావళి తర్వాత ఉద్యమానికి సిద్ధం
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు షాక్ తప్పదా?

విశాలభారతి, స్టేట్ బ్యూరో: దీంతో పీఆర్సీ అంశం కేవలం వేతనాల పెంపునకు సంబంధించిన వ్యవహారంగా కాకుండా, కాంగ్రెస్ పాలనపై ఉద్యోగ వర్గాల అభిప్రాయాన్ని ప్రభావితం చేసే అంశంగా మారుతోంది. పీఆర్సీ నివేదిక విషయంలో ప్రభుత్వం నుంచి వచ్చిన హామీలు ఉద్యోగుల్లో కొత్త ఆశలు కలిగించినా, మిగతా 2లో..



తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల అసంతృప్తి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయ తలనొప్పిగా మారుతోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్‌కు రెండో వేతన సవరణ సంఘం నివేదిక ఆలస్యం ఇబ్బందికరంగా మారింది. కొత్త వేతనాలు ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయో తెలియక ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదురుచూస్తున్నారు. 2023 అక్టోబర్‌లో రెండో పీఆర్సీ ప్రక్రియ ప్రారంభమైన సమయంలో ఆరు నెలల్లో సిఫార్సులు అందిస్తామని ప్రభుత్వం భావించింది. కానీ గడువు ముగిసినా ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో ఉద్యోగ వర్గాల్లో నిరాశ పెరిగింది. ముఖ్యంగా ధరలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో జీతాల పెంపు కోసం ఇంతకాలం వేచి ఉండాల్సి రావడం వారిని అసహనానికి గురిచేస్తోంది. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రభుత్వంపై నమ్మకం తగ్గే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



లంచాలకు మరిగారా

- పీఎస్ వ్యవస్థ కంట్రోల్ తప్పింది
- వరుస ఘటనలపై హైదరాబాద్, మల్కాజిగిరి సీపీలు గరం గరం
- హైదరాబాద్ దోపిడీ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న సీపీ సజ్జనార్
- కీసరలో లంచాల ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీపీ సుమతి
- పోలీసు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన కమిషనర్
- లాంగ్ స్టాండింగ్ హోంగార్డులను వేరే చోటికి పంపాలని ఆదేశం

03

ఫిల్మ్‌నగర్ ఎస్ఐపై బదిలీ వేటు

- స్థానిక పోలీసులను పెద్దసారు పేరు చెప్పి బెదిరించేవాడంటూ గుసగుసలు
- వీఆర్‌కు అటాచ్ చేస్తూ.. ఉత్తర్వులు జారీ
- దారిదోపిడీ కేసులో సలీం పాత్రపై విచారణ
- సదరు ఎస్ఐ సలీంపై అనేక ఫిర్యాదులున్నట్లు చర్చ

02

పరకాల బీఆర్ఎస్‌లో అంతర్గత పోరు

పరకాల బీఆర్ఎస్‌లో పోచంపల్లి, ధర్మారెడ్డి మధ్య విభేదాలు

- క్రికెట్ టోర్నీ ఫ్లెక్సీల్లో ఫొటోల వివాదం
- ధర్మారెడ్డి వర్గీయులు ఫ్లెక్సీలు తొలగించినట్లు ప్రచారం
- ధర్మారెడ్డి కాంగ్రెస్‌లో చేరొచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ
- వచ్చే ఎన్నికల్లో పరకాల టికెట్‌పై ఇద్దరి పేర్లు తెరపైకి
- పోచంపల్లి పోటీపై స్థానికంగా ఆసక్తికర చర్చ

విశాలభారతి, స్టేట్ బ్యూరో: పరకాల బీఆర్ఎస్‌లో అంతర్గత రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. ఇన్నాళ్లూ తెరవెనుక సాగుతున్న ఆధిపత్య పోరు ఇప్పుడు ఫ్లెక్సీల వివాదంతో బహిరంగ చర్చకు వచ్చింది. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మధ్య కొంతకాలంగా రాజకీయ విభేదాలు కొనసాగుతున్నాయనే ప్రచారం ఉంది. తాజాగా ఓ క్రికెట్ టోర్నమెంట్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు మిగతా 2లో..





19న సిద్ధిపేటకు సీఎం రేవంత్

- సిద్ధిపేట వేదికగా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' ప్రారంభం
- ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్న ముఖ్యమంత్రి
- సిద్ధిపేటలో సీఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రుల ముమ్మర పరిశీలన

02

కేసీఆర్ బాటలో కవిత

- తెలంగాణ రక్షణ సేనకు సిద్ధిపేటను కేంద్రంగా కవిత ఎంపిక
- సిద్ధిపేటలో తొలి పార్టీ కార్యాలయ నిర్మాణానికి శ్రీకారం
- కేసీఆర్ రాజకీయ ప్రస్థానం సాగిన గడ్డపైనే కవిత వ్యూహం
- సిద్ధిపేట నుంచే పోటీ చేస్తానని కవిత ప్రకటన
- హరీశ్‌రావుతో భవిష్యత్తులో రాజకీయ పోరు ఉంటుందా?
- హైదరాబాద్‌తో పాటు సిద్ధిపేట నుంచే పార్టీ కార్యకలాపాలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణ రక్షణ సేన పార్టీని ఏర్పాటు చేసి ప్రజల్లోకి వెళ్లిన కల్వకుంట్ల కవిత తన తండ్రి రాజకీయ కంచుకోట నుంచే పార్టీ అజెండాను ఫిక్స్ చేసుకుంది. సిద్ధిపేటను అడ్డాగా చేసుకుని కేసీఆర్ రాజకీయంగా రాణించగా.. కవిత కూడా తన రాజకీయాలకు కేంద్రబిందువుగా మార్చుకుంది. సిద్ధిపేట నుంచే రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలను చేపట్టాలని ఆమె నిర్ణయించుకుంది. ఉద్యమాల పురిటిగడ్డగా పేరొందిన సిద్ధిపేటలో కవిత పార్టీ విస్తరణకు కేంద్రంగా చేసుకోవడంలోని వ్యూహం ఏంటి.? రాష్ట్రంలోనే తొలిసారిగా టీఆర్ఎస్ జిల్లా ఆఫీసును సిద్ధిపేటలోనే నిర్మించడం వెనక ప్లాన్ ఆమె లక్ష్యమేంటనేది ఇప్పటికైతే తెలియదు. సిద్ధిపేట నుంచి పోటీ చేసే ఆలోచనలో ఉన్న కవిత ఇక్కడి ప్రజలకు స్థానికంగా అందుబాటులో ఉండడానికి వీలుగా సొంతంగా ఇల్లు నిర్మించుకోవడంతో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలకు కూడా మధ్యలో ఉంటుంది. ఆయా జిల్లాల పార్టీ నేతలకు హైదరాబాద్‌కు రావడం కంటే మిగతా 2లో..



కేసీఆర్ బాటలో కవిత

మొదటిపేజీ తరువాయి

సిద్దిపేటకే సులువుగా ఉంటుందని, సమయం కలిసి వస్తుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. దీంతో రాష్ట్ర స్థాయి పార్టీ వ్యవహారాలను సిద్దిపేటలోని ఆఫీసు కేంద్రంగానే నిర్వహిస్తారంటున్నారు. హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయం మాదిరిగానే అన్ని సౌకర్యాలతో నిర్మించనున్నారన్నారు. ఇక్కడ ఆఫీసులో మీటింగ్ నిర్వహణకు విశాలమైన హాల్స్, వార్ రూం, డైనింగ్ హాల్, పార్టీకి ఇతర ఆసులను ఒకే చోట నిర్మించాలనే ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర కార్యవర్గ సమావేశాలతో పాటు 200 మంది వరకు చర్చించుకోనే విధంగా మీటింగ్ హాల్స్ ను సైతం నిర్వహించుకోవడానికి అనువుగా జిల్లా ఆఫీసు నిర్మాణం చేయనున్నారు. తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా టీడీపీ నుంచి బయటకు వచ్చిన కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్)ని స్థాపించారు. 2001లో సిద్దిపేట నుంచే ఉప ఎన్నికలో గెలిచాడు. ఆ తర్వాత తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన పలు కీలక సమావేశాలకు, కార్యక్రమాలకు, ఆందోళనలకు సిద్దిపేటనే వేదికైంది. ఇలా సుదీర్ఘ పోరాటం, తెలంగాణ ఏర్పాటు తర్వాత రెండుసార్లు కేసీఆర్ సీఎం అయ్యారు. ఇలా తండ్రి బాటలోనే రాజకీయ కేంద్రంగా మార్చుకోవడానికి కవిత సిద్ధమైనట్టు తెలుస్తోంది. పార్టీ పేరు సైతం టీఆర్ఎస్ అని వచ్చే విధంగా చూసుకోవడంతో పాటు సామాజిక తెలంగాణ సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయడం కూడా అజెండాగా పెట్టుకుంది. తండ్రి కేసీఆర్ పోటీ చేసిన సిద్దిపేట నుంచే బరిలోకి దిగుతానని ప్రకటించారు. ఆయన బాటలోనే కవిత నడుస్తూ రాజకీయాలను చేస్తుండడం అంతటా ఆసక్తిగా మారింది. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన కవిత ఆ తర్వాత



సొంత అజెండాతో పార్టీని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో పర్యటిస్తూ పాంచజన్య బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. ఓ వైపు అధికార కాంగ్రెస్ ను.. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. సొంత కుటుంబ సభ్యులపై విమర్శలు,ఆరోపణలు చేయడానికి సైతం ఆమె వెనుకాడడంలేదు. ముఖ్యంగా బీఆర్ఎస్ ముఖ్య నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావునే ఎక్కువగా టార్గెట్ చేస్తున్నారు. గతంలో సిద్దిపేట నుంచే పోటీ చేస్తానని ప్రకటించి సవాలు విసిరారు. గతేడాది బతుకమ్మ వేడుకలను సొంత గ్రామం చింతమడకలో నిర్వహించిన సమయంలో తన జన్మభూమి .. కర్మ భూమి ఇక సిద్దిపేటనే అని కవిత స్పష్టత ఇచ్చారు. ఆ తర్వాత పలుమార్లు సిద్దిపేట నుంచే పోటీ చేస్తానని ప్రెస్ మీట్‌లలో చెబుతూ వస్తున్నారు. ఆమె చెప్పినట్టు గానే సిద్దిపేటలోనే పార్టీ ఆఫీసు నిర్మించి, ఎక్కువ సమయం కేటాయించి అక్కడి ప్రజలకు చేరువ కావాలనే ప్రయత్నాలు చేస్తున్నట్టు పార్టీ కేడర్ లో చర్చ జరుగుతోంది. గత 40 ఏళ్లుగా సిద్దిపేటలో కేసీఆర్ లేదా హరీశ్ మాత్రమే పోటీ చేస్తూ వరుస విజయాలు సాధించారు. ప్రత్యర్థులు ఎవరైనా కానీ.. కేసీఆర్ కుటుంబానికి ప్రజలు పట్టం కట్టారు. అనూహ్యంగా కేసీఆర్ కుటుంబంలోని ఇద్దరి మధ్య పోటీ ఏమౌతుందనేది చర్చ జరుగుతోంది. సిద్దిపేట ఫస్ట్ చాయిస్ అని కవిత ప్రకటించడం.. ఇల్లు, ఆఫీసు నిర్మించడానికి సిద్ధమవడంతో హరీశ్ వర్సెస్ కవితగా భవిష్యత్ లో బిగ్ ఫైట్‌కు దారితీయనుందా..! అని స్థానికంగా చర్చించుకుంటున్నారు. రాబోయే సిద్దిపేట మున్సిపల్ ఎన్నికల్లోనూ కవిత పోటీచేసి, సత్తా చాటాలనే ప్లాన్ లో ఉంది. కేసీఆర్ కూతురు ఒకవైపు, మేనల్లుడు మరో వైపు సిద్దిపేట కేంద్రంగా రాజకీయాల్లో భవిష్యత్ ఎలాంటి పరిణామాలు ఉంటాయోననే ఆసక్తి సర్వత్రా నెలకొంది. సిద్దిపేటలో టీఆర్ఎస్ తొలి జిల్లా ఆఫీసుకు ఈనెల 13న కవిత భూమిపూజ చేయనుంది. తండ్రి ప్రాతినిథ్యం వహించి, తెలంగాణ రాష్ట్ర సమితి పెట్టిన గడ్డమీదనే తనయ కూడా పార్టీ తొలి ఆఫీసును నిర్మించనుంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో సిద్దిపేటనే తొలిది కావడం విశేషం. టౌన్ పరిధిలోని రాజీవ్ రహదారిపైన రంగధాం పల్లి చౌరస్తాలోని అమలవీరుల స్తూపం వద్ద కవిత సొంత భూమిలో ఆఫీసును నిర్మించనుంది. వెయ్యి గజాల స్థలంలో జి ప్లస్ వన్ తరహాలో ఏర్పాటు చేయనుంది. ఇది పూర్తయిన తర్వాత పార్టీ కార్యక్రమాలను ఇక్కడి నుంచే నిర్వహించడానికి కవిత సిద్ధమైనట్టు తెలుస్తోంది. అన్ని రాజకీయ పార్టీలు హైదరాబాద్ కేంద్రంగానే పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, ఇందుకు భిన్నంగా ఆమె హైదరాబాద్‌తో పాటు సిద్దిపేటను రాజకీయ కేంద్రంగా చేసుకోవాలనే నిర్ణయించుకున్నట్టు పార్టీ నేతల్లో చర్చ జరుగుతోంది.



క్లౌడ్ కిచెన్లపై చర్యలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

నగరంలో టీజీ సేఫ్ అధికారులు 23 క్లౌడ్ కిచెన్లు, రెస్టారెంట్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆహారాన్ని అపరిశుభ్ర వాతావరణంలో, కాలం ముగిసిన పదార్థాలతో చేస్తున్నట్టు గుర్తించారు. 8 క్లౌడ్ కిచెన్లు, రెస్టారెంట్ల లైసెన్సులు రద్దు చేశారు. అలాగే గచ్చిబౌలిలోని బిర్యానీ బైకిలో గుర్తించిన అధికారులు.. ఆ సంస్థ లైసెన్స్‌ను రద్దు చేశారు. మాదాపూర్‌లోని కుల్చా కల్చర్, సోమాజిగూడలోని లక్కీ మల్టీ క్యూసిన్ రెస్టారెంట్, టామ్ యమ్ ఇన్నోవిజన్స్, జోరా 11బై 2, ఐటీసీ ఆశీర్వాద్ సోల్ క్రియేషన్స్ క్లౌడ్ కిచెన్, సోడెక్సో ఇండియా సర్వీసెస్‌ల లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు. అమీర్‌పేటలోని కాకతీయ మెస్, మియాపూర్‌లోని ప్రిజం హాస్పిటాలిటీ సర్వీసెస్, శేరిలింగంపల్లిలోని రెబల్ ఫుడ్స్ తో పాటు మరో ఏడు సంస్థలకు షోకాజు నోటీసులను జారీ చేసినట్టు అధికారులు తెలిపారు. వీటితో పాటు మరో ఐదు సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులను అందజేశారు. తనిఖీల్లో భాగంగా అపరిశుభ్రంగా ఉన్న సుమారు 700 కిలోల ఆహారాన్ని అధికారులు ధ్వంసం చేశారు. ఈ తనిఖీలలో పలు రెస్టారెంట్లలో దెబ్బతిన్న ఫ్లోరింగ్, వంటగదుల్లో పేరుకుపోయిన ఆహార వ్యర్థాలు, సరిగాలేని వాషింగ్ ఏరియా, పూడుకుపోయిన డ్రైనేజీలు, జిడ్డుపట్టిన ఎగ్జాస్ట్ వ్యవస్థాలు ఉన్నట్టు గుర్తించారు.

19న సిద్దిపేటకు సీఎం రేవంత్

తెలంగాణ బ్యూరో.:

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే లక్ష్యంతో రూపొందించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19న సిద్దిపేటలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. అదే వేదికపై ఇందిరమ్మ చీరల పంపిణీ రెండో విడత కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సభ నిర్వహణకు అనువైన ప్రాంతాల ఎంపికపై మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు కూడా ఈ పరిశీలనలో పాల్గొన్నారు. సభకు భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండటంతో



అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సభా ప్రాంగణం ఎంపికతో పాటు వాహనాల పార్కింగ్, వీఐపీ పార్కింగ్, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రాకపోకల మార్గాలపై చర్చించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం అమలులో భాగంగా నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ చేపట్టనున్నారు. ఇందిరమ్మ కమిటీలు ఇంటింటికీ వెళ్లి కుటుంబాల వివరాలు సేకరించి దరఖాస్తులు అందజేసేలా కార్యాచరణ రూపొందించారు. తహసీల్దార్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తులను స్వీకరించనున్నారు. మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ రెండో విడతను కూడా నవంబర్ 19న సిద్దిపేట సభ వేదికగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు లేత ఆకుపచ్చ రంగు చీరలను పంపిణీ చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఇప్పటికే తొలి విడతలో చీరల పంపిణీ చేపట్టగా, తాజాగా రెండో విడతకు ప్రభుత్వం సిద్ధమైంది.

పరకాల బీఆర్ఎస్‌లో అంతర్గత పోరు

మొదటిపేజీ తరువాయి

ఈ విభేదాలకు కేంద్రంగా మారాయి. టోర్నమెంట్ ప్రచార ఫ్లెక్సీల్లో పోచంపల్లి శ్రీనివాసరెడ్డి ఫొటోకు చోటు కల్పించి, చల్లా ధర్మారెడ్డి ఫొటోను పెట్టకపోవడం వివాదానికి కారణమైంది. దీంతో ధర్మారెడ్డి అనుచరులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు, కొన్ని ఫ్లెక్సీలను తొలగించినట్లు ప్రచారం జరిగింది. సాధారణంగా ఒక క్రీడా కార్యక్రమానికి సంబంధించిన ఫ్లెక్సీల వ్యవహారంగా కనిపించినా, దీని వెనుక పరకాల బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న రాజకీయ ఆధిపత్య పోరు ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా ఎవరి ప్రభావం ఎక్కువగా ఉండాలి, భవిష్యత్తులో పార్టీపై ఎవరి పట్టు కొనసాగాలి అనే అంశాల చుట్టూ ఈ పరిణామాలను రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ వివాదంపై ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. క్రికెట్ టోర్నమెంట్ సందర్భంగా మాట్లాడిన ఆయన, ఫ్లెక్సీల చించివేత ఘటనను నేరుగా



ఎవరిపైనా ఆరోపణలు చేయకుండా విజ్ఞతకే వదిలేస్తున్నాననే ధోరణిలో స్పందించారు. నిర్వాహకులను అభినందిస్తూనే, క్రీడా కార్యక్రమాలను రాజకీయ వివాదాలకు వేదికగా మార్చకూడదనే సందేశాన్ని ఇచ్చారు. అయితే ఈ వ్యాఖ్యలు పరోక్షంగా చల్లా ధర్మారెడ్డి వర్గాన్ని ఉద్దేశించినవేననే చర్చ మొదలైంది. మరోవైపు ధర్మారెడ్డి కొంతకాలంగా రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే ప్రచారం కూడా ఆసక్తిని పెంచుతోంది. ఇదే సమయంలో ఆయన బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరవచ్చనే ఊహాగానాలు తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా పరకాల ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో రకరకాల చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ధర్మారెడ్డి కాంగ్రెస్‌లో చేరితే పరకాల నియోజకవర్గంలో ఆయనకు రాజకీయంగా అవకాశం దక్కవచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ ప్రస్తుతానికి రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చలే తప్ప, పార్టీ మార్పుపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. చల్లా ధర్మారెడ్డి రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే, ఆయన గతంలో తెలుగుదేశం పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరి పరకాల రాజకీయాల్లో కీలకమైన నాయకుడిగా ఎదిగారు. నియోజకవర్గంలో తనకంటూ ఒక రాజకీయ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇదే సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కూడా గతంలో టీడీపీలో పనిచేసి, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి రాజకీయంగా ముందుకు సాగారు. ఇప్పుడు ధర్మారెడ్డి కూడా కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తారనే ప్రచారం మొదలవడంతో పరకాల రాజకీయాల్లో కొత్త సమీకరణాలపై చర్చ జరుగుతోంది. ఒకవేళ ఆయన పార్టీ మారితే కాంగ్రెస్ నాయకత్వం నుంచి ఎలాంటి స్పందన వస్తుంది, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ విషయంలో ఆయనకు ప్రాధాన్యం లభిస్తుందా అనే అంశాలు కీలకంగా మారనున్నాయి. అయితే కాంగ్రెస్‌లో ఇప్పటికే స్థానిక నాయకత్వం, ప్రస్తుత ఎమ్మెల్యే వర్గం, ఇతర ఆశావహులు ఉండటంతో ధర్మారెడ్డి చేరిక అంత సులభమైన రాజకీయ పరిణామం కాకపోవచ్చు. మరోవైపు బీఆర్ఎస్‌లోనే కొనసాగితే ఆయనకు భవిష్యత్తులో ఎలాంటి బాధ్యతలు దక్కుతాయనేది కూడా ఆసక్తికరమే. ఎన్నికలకు ఇంకా రెండేళ్లకుపైగా సమయం ఉన్నప్పటికీ, ఇప్పటి నుంచే నియోజకవర్గంలో రాజకీయ బలాబలాల లెక్కలు మొదలైనట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. ఇక ఈ మొత్తం వ్యవహారంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి పేరు తెరపైకి రావడం మరో కీలక పరిణామం.



నిబంధనలకు పాతర

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ నిర్వహణలో రాంకీ నిర్లక్ష్యం
- చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయకుండా కాల్చివేత
- రోగాలబారిన పడుతున్న పరిసర ప్రాంతాల ప్రజలు
- యార్డ్‌ను ఎత్తివేయాలని 18 నుంచి రిలే నిరాహార దీక్షలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ నిర్వహణలో రాంకీ సంస్థ నిబంధనలకు పాతర వేస్తున్నది అనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయకుండా టన్నుల కొద్ది చెత్తను కాల్చివేస్తున్నారు. దీంతో దుర్వాసనతో పాటు విషపూరిత పొగ వెలువడటంతో చుట్టుపక్కల ప్రాంతాలైన జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారంలో నివసించే లక్షలాది ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు శ్వాసకోస వ్యాధులు, చర్మ వ్యాధుల బారిన పడుతున్నారు. వాస్తవానికి డంపింగ్ యార్డ్‌కు వచ్చే చెత్తను శాస్త్రీయంగా వేర్వురుగా చేసి తడిచెత్తతో ఎరువు, పొడి చెత్తతో విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా టన్నుల కొద్ది వచ్చిన చెత్తను యార్డులోనే కాల్చివేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రాంకీ సంస్థ చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయకుండా కాల్చివేసి పర్యావరణంతో పాటు ప్రజలకు ఇబ్బందులు గురి చేస్తున్నా అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నరాని డంపింగ్ యార్డ్ సమీపంలోని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి, ఎంఎంసీ, పర్యావరణ శాఖ అధికారులు ఇక్కడ ఇంత జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతాన్ని మర్చిపోవద్దు

మొదటిపేజీ తరువాయి

ఆధారపడి ఉంటుందనే అంశాన్ని రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. కొద్దిమంది అధికారులు తప్పుగా వ్యవహరించినా, దాని ప్రభావం మొత్తం ప్రభుత్వ పాలనపై పడుతుందని హెచ్చరించారు. శాంతిభద్రతలు క్షీణించాయని, అవినీతి పెరిగిందని ప్రతిపక్షాలు విమర్శించే పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. అదే సమయంలో పోలీసులు నిబద్ధతతో, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తిస్తే ప్రభుత్వానికి ప్రజల్లో మంచి గుర్తింపు వస్తుందని చెప్పారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో వ్యవహరించే విధానం మారాలని సూచించారు. సమస్యతో వచ్చిన వ్యక్తిని నిలబెట్టి ప్రశ్నించడం కాకుండా, గౌరవంగా కూర్చోబెట్టి ఓపికగా మాట్లాడితేనే అతనికి సగం భరోసా లభిస్తుందని వివరించారు. ప్రజల సమస్యలను వినడం కూడా పోలీసుల విధుల్లో భాగమేనని గుర్తుచేశారు. అధికారుల నుంచి ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలను ఆశించడం లేదని, ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడాలని ఆదేశించడం లేదని స్పష్టం చేశారు. నిజాయితీగా పనిచేయడం, చట్టాన్ని గౌరవించడం, ప్రజలకు న్యాయం చేయడం మాత్రమే ఆశిస్తున్నామని తెలిపారు. గతంలో సీనియర్ అధికారులు ఎన్నో త్యాగాలు చేసి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకొచ్చారని, ఆ గౌరవాన్ని మరింత పెంచాల్సిన బాధ్యత కొత్త అధికారులపై ఉందని చెప్పారు. ఇక మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసింగ్ విధానాలు కూడా మారాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పోలీసులకు అతిపెద్ద సవాల్‌గా మారుతున్నాయని, సామాన్య ప్రజల నుంచి ఉన్నత స్థాయి వ్యక్తుల వరకు అనేక మంది ఆన్‌లైన్ మోసాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. సైబర్ నేరాలతో పాటు డ్రగ్స్ నియంత్రణ, ఆహార కల్తీ, ట్రాఫిక్ సమస్యలపై కూడా యువ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నేరాల స్వభావం మారుతున్నప్పుడు వాటిని ఎదుర్కొనే అధికారుల నైపుణ్యాలు కూడా పెరగాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు. సైబర్ క్రైమ్, ఫోరెన్సిక్ విభాగాలపై ఆసక్తి, ప్రతిభ ఉన్న డీఎస్పీలను విదేశాలకు పంపించి ప్రత్యేక శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఇది కేవలం



శిక్షణకు సంబంధించిన అంశం మాత్రమే కాదు.. భవిష్యత్తులో సాంకేతిక పరిజ్ఞానంతో జరిగే నేరాలను ఎదుర్కొనేందుకు తెలంగాణ పోలీస్ వ్యవస్థను సిద్ధం చేసే ప్రయత్నంగా చూడవచ్చు. మరోవైపు పోలీసులకు శారీరక దృఢత్వం కూడా ఎంతో అవసరమని సీఎం గుర్తుచేశారు. ఫిట్‌నెస్ విషయంలో రాజీ పడొద్దని చెబుతూ, బెల్ట్ లూజ్ అయినా పర్వాలేదు కానీ టైట్ కాకూడదంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల వెనుక ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలనే సూచనతో పాటు, క్రమశిక్షణతో కూడిన పోలీస్ జీవితంపై ఆయన ఇచ్చిన సందేశం కనిపిస్తోంది. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, ముఖ్యంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ వ్యవహారంపై కూడా సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో గ్రూప్1 నియామకాలు సంవత్సరాల తరబడి సాగాయని, నోటిఫికేషన్లు, పరీక్షల నిర్వహణలో ఏర్పడిన గందరగోళం వల్ల ఎంతోమంది అభ్యర్థులు నష్టపోయారని విమర్శించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను యూపీఎస్సీ తరహాలో తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో అనుభవం, నిబద్ధత ఉన్న వ్యక్తులను బోర్డులో నియమించినట్లు వివరించారు. గతంలో రాజకీయ ప్రయోజనాల కోసం కమిషన్‌ను ఉపయోగించుకున్నారని ఆరోపిస్తూ, నియామకాల విషయంలో అవగాహన లేని నిర్ణయాలు తీసుకోవడం వల్ల యువత భవిష్యత్తు దెబ్బతిన్నదని అన్నారు. తమ ప్రభుత్వం 563 గ్రూప్1 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా, 562 మంది ఉద్యోగాల్లో చేరినట్లు వెల్లడించారు. ఈ నియామకాల విషయంలో కొందరు అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్నారని, వాటిని రాజకీయ విమర్శలుగానే చూస్తున్నామని చెప్పారు. అభ్యర్థులకు న్యాయం జరిగేలా అవసరమైన న్యాయ పోరాటం చేసి, సుప్రీంకోర్టు వరకు వెళ్లి నియామక ప్రక్రియను ముందుకు తీసుకెళ్లామని గుర్తుచేశారు. ఈ వ్యాఖ్యల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో తమ ప్రభుత్వ పాత్రను వివరించడంతో పాటు, నియామక వ్యవస్థలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం చెప్పే ప్రయత్నం చేశారు. మొత్తంగా చూస్తే, 112 మంది కొత్త డీఎస్పీలతో సీఎం నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమం కేవలం శిక్షణ ముగింపు వేడుకగా మాత్రమే కాకుండా, తెలంగాణ పోలీస్ వ్యవస్థ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే కార్యక్రమంగా నిలిచింది. ముఖ్యమంత్రి ప్రసంగంలో మూడు ప్రధాన అంశాలు స్పష్టంగా కనిపించాయి. మొదటిది, ప్రజలతో గౌరవంగా వ్యవహరించడం ద్వారా పోలీసులపై నమ్మకాన్ని పెంచడం. రెండోది, సైబర్ నేరాలు, డ్రగ్స్, ఆహార కల్తీ వంటి కొత్త సవాళ్లను ఎదుర్కొనేలా సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం. మూడోది, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా చట్టం, న్యాయం, నిజాయితీకి కట్టుబడి పనిచేయడం. డీజీపీ సీవీ ఆనంద్ కూడా రాబోయే 30 ఏళ్లు పోలీసులకు అత్యంత కీలకమని చెబుతూ, సైబర్ మోసాలు, ఆహార కల్తీ వంటి సమస్యలపై యువ అధికారులు సమర్థంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం, పోలీస్ శాఖ నుంచి కొత్త అధికారులకు పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. అయితే ప్రభుత్వం అందించే సహకారం ఎంత ముఖ్యమో, క్షేత్రస్థాయిలో అధికారులు చూపించే చిత్తశుద్ధి కూడా అంతే ముఖ్యం. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు వారికి భయం కాకుండా భరోసా కలగాలి. అధికారాన్ని ప్రదర్శించడం కంటే బాధితుడికి న్యాయం చేయడమే ప్రాధాన్యంగా ఉండాలి. రాబోయే రోజుల్లో ఈ 112 మంది డీఎస్పీలు తమ విధి నిర్వహణతో ప్రజల విశ్వాసాన్ని ఎంతవరకు గెలుచుకుంటారనేదే తెలంగాణ పోలీస్ శాఖకు అసలైన పరీక్షగా నిలవనుంది.

ఫిల్మ్‌నగర్ ఎస్ఐపై బదిలీ వేటు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

నగరంలో దారిదోపిడీకి పాల్పడిన ఇద్దరు పోలీసులకు వత్తాసు పలికి తాను ఆ సమయంలో డ్యూటీలో లేనట్లుగా చూపించుకునే ప్రయత్నం చేసిన ఫిల్మ్‌నగర్ ఎస్ఐ సలీంపై వేటు పడింది. 'నమస్తే తెలంగాణ'లో వరుస కథనాల నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు అతనిని వీఆర్‌కు అటాచ్ చేస్తూ..ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 4న షేక్‌పేట వద్ద జరిగిన ఘటనలో ఒక వ్యక్తి దగ్గర డబ్బులున్నాయని గుర్తించిన ఫిల్మ్‌నగర్ కానిస్టేబుల్ మల్సూర్, హోంగార్డు వి. మోహన్‌గౌడ్ తమకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడం, అతను తనకు అత్యవసరం ఉండి తన స్నేహితుడి దగ్గర డబ్బులు అప్పు తీసుకున్నానని చెప్పారు. అయినా వినకుండా జీపు ఎక్కాలంటూ.. బెదిరించి అతని చేతి నుంచి డబ్బుల బ్యాగు లాక్కుని అందులో రూ.50వేలు తీసుకుని పంపించారు. బాధితుడు ఫిల్మ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఆ ఇద్దరు పోలీసులపై ఫిర్యాదు చేయడంతో మల్సూర్ పరారయ్యాడు. ఈ మొత్తం వ్యవహారంలో సలీంను తప్పించడానికి ఒకరిద్దరు అధికారులు ప్రయత్నించడంతో పాటు డ్యూటీ రిజిస్టర్‌లో ఆ రోజు అతని పేరు లేకుండా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో 'నమస్తే తెలంగాణ' దగ్గర ఉన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ సలీం డైరెక్షన్‌లోనే ఈ దోపిడీ వ్యవహారమంతా జరిగిందని, ఇందులో కానిస్టేబుల్ వాటానుంచి అతనికీ వాటా ముట్టిందని తెలిసింది. అయితే డ్యూటీ రిజిస్టర్‌లో అతని పేరు లేకపోవడంతో పాటు స్పాట్‌లో అతను లేడంటూ ఉన్నతాధికారులు చెప్పారు. నమస్తే తెలంగాణలో కథనాలు వచ్చిన తర్వాత సీపీ సజ్జనార్ సీరియస్ అయ్యారు. ఎస్బీ విచారణలో ప్రాథమికంగా సలీంపై పలు ఫిర్యాదులు ఉండడం, అతనికి ఈ దోపిడీలో భాగమెంత అనే దానిపై పూర్తి వివరాలు సేకరించారు. ఈ క్రమంలో సబ్‌ఇన్‌స్పెక్టర్ సలీంను వీఆర్‌కు అటాచ్ చేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

సలీం తీరుపై పోలీసుల్లో చర్చ!

ఈ ఉదంతంపై హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. పోలీసులే దారిదోపిడీకి పాల్పడడం, ప్రత్యేకించి వారికి సంబంధించని సెక్టార్‌లో ఒక స్వెట్టర్ కొనుక్కోవడానికి వెళ్లి అక్కడ డబ్బులు లెక్కపెట్టుకుంటున్న వ్యక్తిని టార్గెట్ చేసి డబ్బులు లాక్కోవడం పోలీసు శాఖకే అప్రతిష్ట తెచ్చిందంటూ.. పలువురు ఉన్నతాధికారులు వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ఎవరెవరు భాగస్వాములయ్యారో వారందరిపై చర్యలు తీసుకోవాలంటూ ఒక సీనియర్ అధికారి కోరారు. సలీంపై మొదటినుంచి చాలా ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ మరో ప్రత్యేక కేసులో పనిచేస్తుండడంతో అక్కడి మరో అధికారితో కలిసి పెద్ద ఎత్తున ఆర్థిక లావాదేవీలు చేపట్టినట్లుగా పోలీసు స్టేషన్‌లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. తాను పెద్దసారు మనిషిని, తనను ఎవరైనా టచ్ చేస్తే వారికే కరెంట్ షాక్ కొడుతుందంటూ.. సలీం చాలాసార్లు స్థానిక పోలీసులను బెదిరించినట్లు కూడా చెప్పుకొంటున్నారు.

కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పి!

మొదటిపేజీ తరువాయి

ఆచరణలో మాత్రం ఆశించిన వేగం కనిపించడం లేదు. ఈ ఏడాది మే 2న ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నివేదికను త్వరగా అందించాలని అధికారుల కమిటీకి సూచించారు. నివేదిక వచ్చిన తర్వాత దాని ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. అనంతరం సెప్టెంబర్ 18లోగా సిఫార్సులు సమర్పించాలని గడువు విధించినప్పటికీ నవంబర్ నాటికి కూడా ఉద్యోగులకు స్పష్టమైన పరిష్కారం లభించలేదు. దీంతో హామీలకు, అమలుకు మధ్య దూరం పెరుగుతోందనే భావన ఉద్యోగుల్లో బలపడుతోంది. మరోవైపు ఉద్యోగ సంఘాలు తమ డిమాండ్ల విషయంలో వెనక్కి తగ్గడం లేదు. 2023 జూలై 1 నుంచి కొత్త వేతనాలు అమలు చేయాలని, కనీసం 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని పట్టుబడుతున్నాయి. వేతన సవరణ ఆలస్యమయ్యే కొద్దీ ఉద్యోగుల ఆర్థిక అంచనాలు దెబ్బతింటున్నాయి. ఈ అంశాన్ని ప్రభుత్వం ఎంత త్వరగా తేలుస్తుందన్న దానిపైనే ఉద్యోగ వర్గాల్లో తదుపరి కార్యాచరణ ఆధారపడి ఉంది. పీఆర్సీతో పాటు ఉద్యోగులు మరో మూడు కీలక అంశాలపై ప్రభుత్వం నుంచి నిర్ణయం కోరుతున్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులు, కరవు



భత్యం బకాయిలు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ ప్రధాన డిమాండ్లుగా ఉన్నాయి. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల విలువ రూ.10 వేల కోట్లకు పైగా ఉందని జేఏసీ నేతలు చెబుతున్నారు. ప్రస్తుతం బిల్లుల చెల్లింపుల కోసం నెలకు కేటాయిస్తున్న రూ.1,000 కోట్లను రూ.2,000 కోట్లకు పెంచాలని కోరుతున్నారు. అలాగే పాత పెన్షన్ విధానం అమలుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారమైతేనే ఉద్యోగుల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుందనే అభిప్రాయం సంఘాల్లో కనిపిస్తోంది. నవంబర్ 6న హైదరాబాద్‌లోని టీజీవో భవన్‌లో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించి, దీపావళి తర్వాత ఉద్యమ కార్యాచరణ ప్రకటించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అంటే పీఆర్సీ అంశం ఇప్పుడు చర్చలకే పరిమితం కాకుండా, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే దిశగా సాగుతోంది. ఉద్యోగ సంఘాలు ఏ స్థాయిలో ఉద్యమానికి సిద్ధమవుతాయన్నది కీలకంగా మారింది. ఈ పరిణామాల ప్రభావం రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై పడే అవకాశాలు కాంగ్రెస్‌కు ఆందోళన కలిగిస్తున్నాయి. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఓటర్లుగా ఉండటం రాజకీయంగా కీలకమైన అంశం. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో నాలుగు లక్షలకు పైగా ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది గ్రాడ్యుయేట్లుగా ఉన్నారని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. వీరిలో గణనీయమైన సంఖ్యలో ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావడానికి దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొంటున్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సాధారణ రాజకీయ ప్రచారం కంటే ఉద్యోగుల సమస్యలు, ప్రభుత్వ విధానాలే ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పీఆర్సీ, పెండింగ్ బిల్లుల వంటి అంశాలు ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేయవచ్చు. ఉద్యోగ సంఘాలు తమ డిమాండ్లను ఎన్నికల ప్రచారంలో ప్రధాన అంశంగా మార్చితే కాంగ్రెస్ అభ్యర్థులకు పోటీ మరింత కఠినమయ్యే అవకాశం ఉంది. అందుకే ఉద్యోగుల అసంతృప్తి ఇప్పుడు పరిపాలనా అంశాన్ని దాటి రాజకీయ చర్చగా మారుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి అసలు పరీక్ష ఇక్కడే మొదలుకానుంది. ఎన్నికల సమయంలో ఉద్యోగ వర్గాలకు ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేస్తుందన్నది ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. పీఆర్సీ నివేదిక విడుదల చేసి, ఫిట్‌మెంట్‌పై స్పష్టత ఇవ్వడంతో పాటు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు వేగం పెంచితే ఉద్యోగుల్లో కొంత సానుకూలత వచ్చే అవకాశం ఉంది. అయితే ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు కూడా కీలకమే. ఒకవైపు రాష్ట్ర ఖజానాపై భారం, మరోవైపు ఉద్యోగుల డిమాండ్లు.. ఈ రెండింటి మధ్య ప్రభుత్వం సమతుల్యత సాధించాల్సి ఉంది. ఆలస్యం మరింత కొనసాగితే ఉద్యోగ సంఘాల ఉద్యమం బలపడటమే కాకుండా, ఎన్నికల సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేక వాతావరణం ఏర్పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో ఉద్యోగుల ఓటు కీలకంగా మారే అవకాశం ఉంది.

షేక్ హసీనాకు మరణశిక్షే

విశాలభారతి, అంతర్జాతీయం:

బంగ్లాదేశ్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర సంచలనం మొదలైంది. ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా విషయంలో ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారుతోంది. తనపై విధించిన మరణశిక్ష, కొనసాగుతున్న న్యాయపరమైన విచారణల మధ్య బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లేందుకు హసీనా ప్రయత్నిస్తున్నట్లు వచ్చిన సమాచారం ఇప్పుడు కొత్త రాజకీయ పరిణామాలకు దారితీసింది. అయితే ఆమెకు ఎలాంటి ఉపశమనం కల్పించే అవకాశం లేదని, మరణశిక్ష అమలు తప్ప మరో చట్టపరమైన మార్గం లేదని బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ చీఫ్ ప్రాసిక్యూటర్ ఎండీ అమీన్ ఉల్ ఇస్లాం చేసిన వ్యాఖ్యలు పరిస్థితిని మరింత తీవ్రంగా మార్చాయి. కొత్త పాస్‌పోర్ట్ లేదా ప్రయాణ పత్రాలు జారీ చేసే అవకాశం కూడా లేదని ఆయన స్పష్టం చేయడం హసీనా తిరుగు ప్రయాణంపై అనేక సందేహాలను రేకెత్తిస్తోంది. ఒకప్పుడు బంగ్లాదేశ్ రాజకీయాలను శాసించిన నాయకురాలికి ఇప్పుడు సొంత దేశంలోనే తిరిగి అడుగుపెట్టే పరిస్థితులు ఇంత క్లిష్టంగా మారడం గమనించాల్సిన పరిణామం. ఈ పరిణామాల వెనుక 2024 ఆగస్టులో బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న భారీ రాజకీయ తిరుగుబాటు ఉంది. విద్యార్థుల నేతృత్వంలో ప్రారంభమైన నిరసనలు క్రమంగా దేశవ్యాప్త ఆందోళనలుగా మారాయి. ప్రభుత్వ విధానాలు, పాలనా తీరుపై పెరిగిన అసంతృప్తి ప్రజల ఆగ్రహంగా మారడంతో అప్పటి ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం కుప్పకూలింది. పరిస్థితులు అదుపు తప్పడంతో



పదవిలో ఉండగానే హసీనా బంగ్లాదేశ్‌ను విడిచిపెట్టి భారత్‌కు చేరుకున్నారు. అప్పటి నుంచి ఆమె భారత్‌లోనే ఉంటున్నారు. మరోవైపు, నిరసనలను అణచివేసే క్రమంలో భద్రతా బలగాలు, ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరించిన తీరుపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఆందోళనకారులపై జరిగిన హింసకు హసీనానే బాధ్యత వహించాలంటూ బంగ్లాదేశ్‌లో న్యాయపరమైన ప్రక్రియ మొదలైంది. ఈ కేసులు కేవలం రాజకీయ ఆరోపణలకే పరిమితం కాకుండా, మానవ హక్కులు, ప్రభుత్వ బాధ్యత, న్యాయవ్యవస్థ స్వతంత్రత వంటి అంశాలతో ముడిపడిపోయాయి. ఈ కేసుల్లో అత్యంత కీలకమైన పరిణామం హసీనాకు మరణశిక్ష విధిస్తూ బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు. ఆమె నేరుగా కోర్టుకు హాజరుకాకుండానే, గైర్హాజరీలో విచారణ జరిపి ఈ తీర్పు వెలువరించడం అంతర్జాతీయంగా కూడా చర్చకు దారితీసింది. అయితే ఈ తీర్పును హసీనా అంగీకరించడం లేదు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం నిర్వహిస్తున్న విచారణల చట్టబద్ధతపైనే తనకు అభ్యంతరాలున్నాయని ఆమె వాదిస్తున్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఒకవైపు నిరసనల్లో ప్రాణాలు కోల్పోయినవారికి న్యాయం జరగాలనే డిమాండ్ ఉంది. మరోవైపు, నిందితురాలికి న్యాయమైన విచారణ, అప్పీల్ చేసుకునే అవకాశం, న్యాయ ప్రక్రియలో పారదర్శకత ఉండాలనే అంశాలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అందువల్ల ఈ వ్యవహారం కేవలం ఒక మాజీ ప్రధానిపై నమోదైన కేసుగా కాకుండా, బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థ భవిష్యత్తును ప్రభావితం చేసే పరిణామంగా మారింది. ఇదిలా ఉంటే, హసీనా తరఫున లండన్‌కు చెందిన ఒక న్యాయ సంస్థ ద్వారా కొత్త పాస్‌పోర్ట్, జాతీయ గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసినట్లు సమాచారం. రానున్న డిసెంబరులో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లి తనపై ఉన్న కేసులను ఎదుర్కోవాలనే ఉద్దేశాన్ని ఆమె వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. గతంలో మహ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం ఆమె పాస్‌పోర్ట్‌తో పాటు జాతీయ గుర్తింపు కార్డును రద్దు చేసింది. దీంతో ప్రయాణానికి అవసరమైన అధికారిక పత్రాలే ఇప్పుడు ప్రధాన అడ్డంకిగా మారాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌ను హసీనా ఆశ్రయించినట్లు వచ్చిన సమాచారం మరింత ఆసక్తిని కలిగించింది. అయితే ఆ పరిణామం తర్వాతే కొత్త పాస్‌పోర్ట్ జారీ చేసే ప్రసక్తే లేదని బంగ్లాదేశ్ చీఫ్ ప్రాసిక్యూటర్ ప్రకటించడం గమనార్హం. అంటే హసీనా తిరిగి రావాలనే సంకల్పం వ్యక్తం చేస్తున్నప్పటికీ, ఆమెకు అవసరమైన ప్రయాణ పత్రాల విషయంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం నుంచి సహకారం లభించే సూచనలు కనిపించడం లేదు. ఈ పరిణామం ఆమె రాజకీయ, న్యాయపరమైన భవిష్యత్తును మరింత సంక్లిష్టంగా మార్చే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే, షేక్ హసీనా వ్యవహారం ఇప్పుడు బంగ్లాదేశ్ అంతర్గత రాజకీయాలకే పరిమితమైన అంశం కాదు. భారత్‌తో ఆ దేశ సంబంధాలు, అంతర్జాతీయ దౌత్యం, మానవ హక్కులు, న్యాయ వ్యవస్థ విశ్వసనీయత వంటి అనేక అంశాలపై దీని ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా హసీనా భారత్‌లో ఉండటం, తిరిగి బంగ్లాదేశ్‌కు వెళ్లాలని ప్రయత్నిస్తున్నట్లు వార్తలు రావడం రెండు దేశాల మధ్య దౌత్యపరమైన చర్చలకు కూడా కారణం కావచ్చు. అయితే ఆమెకు మరణశిక్ష విధించిన తీర్పు అమలు కావాలంటే చట్టపరమైన ప్రక్రియలు, అప్పీల్ అవకాశాలు, సంబంధిత దేశాల మధ్య ఉన్న న్యాయపరమైన అంశాలు కీలకంగా మారతాయి. మరోవైపు, బంగ్లాదేశ్‌లో ప్రస్తుత ప్రభుత్వం ఈ కేసును ఎలా ముందుకు తీసుకెళ్తుంది, హసీనాకు న్యాయపరమైన అవకాశాలు ఎలా ఉంటాయి, ఆమె నిజంగానే డిసెంబరులో స్వదేశానికి తిరిగి వస్తారా అనే అంశాలు రాబోయే రోజుల్లో స్పష్టతకు రానున్నాయి. ఒకప్పుడు బంగ్లాదేశ్‌ను సుదీర్ఘకాలం పాలించిన నాయకురాలు ఇప్పుడు తన సొంత దేశంలోనే తీవ్ర న్యాయపరమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటుండటం ఆ దేశ రాజకీయ చరిత్రలో కీలక మలుపుగా నిలిచే అవకాశం ఉంది.

పార్లమెంట్‌కు రా..!

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లోనూ చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించిన తీరును బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. దేశ భద్రత కోసం పనిచేస్తున్న సైనికులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు, ఇతర పారామిలిటరీ బలగాల పట్ల కాంగ్రెస్ పార్టీకి తగిన గౌరవం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. సైనికుల త్యాగాలను రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ సైనికులతో పండుగలు జరుపుకోవడాన్ని కూడా రాజకీయ కోణంలో చూడటం తగదని పేర్కొన్నారు. ఈ అంశం కేవలం ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధానికే పరిమితం కాకుండా, దేశ భద్రత, సైనికుల గౌరవం, రాజకీయ బాధ్యత వంటి అంశాలను మరోసారి తెరపైకి తీసుకొచ్చింది. బస్తర్ ప్రాంతంలో నక్సలైట్ల ప్రభావం తగ్గించేందుకు భద్రతా బలగాలు ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నాయి. ఈ క్రమంలో విధి నిర్వహణలో అనేక మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి ప్రాంతానికి వెళ్లిన ప్రధాని మోదీ.. సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి దీపావళి జరుపుకోవడం ద్వారా వారిలో ధైర్యాన్ని పెంచే ప్రయత్నం చేశారని రామచందర్ రావు పేర్కొన్నారు. సరిహద్దుల్లోనే కాకుండా దేశంలోని సమస్యాత్మక ప్రాంతాల్లోనూ సైనికులు, భద్రతా సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. వారి కుటుంబాలకు దూరంగా ఉంటూ దేశ రక్షణ కోసం పనిచేసే సిబ్బందికి ప్రధానమంత్రి స్వయంగా సమయం కేటాయించడం ప్రాధాన్యత కలిగిన విషయమని ఆయన వ్యాఖ్యానించారు. అయితే బస్తర్‌లో గతంలో జరిగిన దాడులు, జవాన్ల మరణాల సమయంలో కాంగ్రెస్ పార్టీ స్పందించిన తీరుపై రామచందర్ రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. నక్సలైట్ల హింస, పుల్వామా దాడి వంటి ఘటనల విషయంలో కాంగ్రెస్ వైఖరిని ఆయన విమర్శించారు. ఇదిలా ఉంటే, బస్తర్ పర్యటనలో ప్రధాని మోదీ చేసిన మరో వ్యాఖ్య రాజకీయంగా పెద్ద చర్చకు కారణమైంది. దేశంలో ఆయుధాలు పట్టిన నక్సలిజం క్రమంగా బలహీనపడుతున్నప్పటికీ, వ్యవస్థల్లోకి చొరబడే మేధో నక్సలిజం రూపంలో కొత్త సవాలు ఎదురవుతోందని ఆయన పేర్కొన్నారు. విద్యా, సామాజిక, ఇతర సంస్థల్లో భావజాలం పేరుతో ప్రభావం చూపే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా ఘాటుగా స్పందించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతిపక్ష నేతలను నక్సల్స్‌గా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రతిపక్షాల బాధ్యత అని పేర్కొంటూ, దేశద్రోహి ఎవరో తేల్చేందుకు బహిరంగ చర్చకు రావాలని ప్రధాని మోదీకి సవాల్ విసిరారు. దీంతో నక్సలిజంపై మొదలైన చర్చ కాస్తా ప్రతిపక్షాల స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కుల దిశగా మళ్లింది. రాహుల్ గాంధీ చేసిన సవాల్‌కు రామచందర్ రావు తనదైన శైలిలో సమాధానమిచ్చారు. విదేశాల పేర్లు ప్రస్తావిస్తూ రాజకీయ విమర్శలు చేయడం కంటే, నేరుగా పార్లమెంట్‌కు వచ్చి చర్చల్లో పాల్గొనాలని సూచించారు. వియత్నాం, రష్యా, అమెరికా వంటి దేశాలకు వెళ్లకుండా దేశ ప్రజలు ఎన్నుకున్న సభలోనే తన అభిప్రాయాలను వెల్లడించాలని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ అనేది ప్రజల సమస్యలు, దేశ భవిష్యత్తు, భద్రత వంటి అంశాలపై చర్చించాల్సిన వేదిక అని గుర్తుచేశారు. అక్కడే ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే అవకాశం ఉంటుందని, అదే సమయంలో అధికార పక్షం కూడా తన నిర్ణయాలను సమర్థించుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. రాహుల్ గాంధీ సవాల్‌ను స్వీకరించే బదులు పార్లమెంట్‌కు రావాలని చెప్పడం ద్వారా రామచందర్ రావు ఈ వివాదాన్ని నేరుగా సభా చర్చల వైపు మళ్లించే ప్రయత్నం చేశారు. దీంతో బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం మరింత ఆసక్తికరంగా మారింది. మొత్తంగా చూస్తే, బస్తర్‌లో ప్రధాని మోదీ చేసిన ప్రసంగం ఒక ప్రాంతానికి సంబంధించిన అంశంగా మొదలై జాతీయ రాజకీయ చర్చగా మారింది. నక్సలిజం నిర్మూలన, మేధో నక్సలిజం భావన, ప్రతిపక్షాలపై విమర్శలు, సైనికుల గౌరవం వంటి అంశాలు ఈ వివాదంలో కీలకంగా నిలిచాయి. బీజేపీ వైపు నుంచి దేశ భద్రత, జవాన్ల త్యాగాలకు ప్రాధాన్యం ఇస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు వస్తుండగా, రాహుల్ గాంధీ మాత్రం ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను నక్సలిజంతో ముడిపెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమనే వాదనను ముందుకు తెచ్చారు. ఇక్కడ ప్రధానంగా కనిపిస్తున్నది రెండు పార్టీల మధ్య భిన్నమైన రాజకీయ దృక్పథం. ఒకవైపు నక్సలిజంపై కఠిన వైఖరి అవసరమని బీజేపీ చెబుతుండగా, మరోవైపు ప్రభుత్వ విమర్శలను దేశ వ్యతిరేకతగా చూడకూడదని కాంగ్రెస్ వాదిస్తోంది. ఈ రెండు వైఖరుల మధ్య బస్తర్ అంశం పార్లమెంట్ వేదికగా ఎలాంటి చర్చకు దారితీస్తుందన్నది రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.



ఓయూకు వెయ్యి కోట్లు ఏమయ్యాయి రేవంత్

- నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సిందే
- బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రేవంత్.. ఓయూకు ఇస్తానన్న వెయ్యి కోట్లు ఏమయ్యాయని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఓయూ నాన్ టీచింగ్ స్టాఫ్ జేఏసీ ఆధ్వర్యంలో పరిపాలనా భవనం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎంపీలు ఈటల రాజేందర్, ఆర్ కృష్ణయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ (కాంట్రాక్ట్ - తెలంగాణ స్టేట్) అధ్యక్షుడు డాక్టర్ పరశురాం, కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ధర్మతేజ తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవేనన్నారు. వాటిని తక్షణమే పరిష్కరించకుండా జాప్యం చేస్తున్న అధికారుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ ఓయూకు ఇస్తానన్న వెయ్యి కోట్లు ఏమయ్యాయంటూ.. తక్షణమే ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీ ఉద్యోగులకు తక్షణమే హెల్త్‌కార్డులు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. రూ.15 వేల నెల జీతం తీసుకుంటూ.. ఉద్యోగులు ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. వర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల పరిస్థితి భవన నిర్మాణ కార్మికులకంటే దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తూ చనిపోతే రూ. 10 లక్షలు, గాయపడితే రూ. 5 లక్షలు ఇస్తారని, కానీ వర్సిటీ ఉద్యోగులకు కనీసం లక్ష కూడా ఇవ్వడం లేదని వాపోయారు.

అండాల దందాపై మహిళా కమిషన్ సీరియస్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్‌లో వెలుగుచూసిన అక్రమ అండాల సేకరణ వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. వైద్య సేవల పేరుతో నడవాల్సిన కొన్ని ఫెర్టిలిటీ కేంద్రాలు, మహిళల జీవితాలతో వ్యాపారం చేస్తున్నాయనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా పేదరికం, ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని యువతులను లక్ష్యంగా చేసుకోవడం ఈ వ్యవహారంలో అత్యంత ఆందోళనకరమైన అంశం. బయటకు ఉద్యోగాల కల్పన, అదనపు ఆదాయం వంటి ఆశలు చూపిస్తూ, లోపల మాత్రం అండాల సేకరణకు సంబంధించిన అక్రమ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు మహిళా కమిషన్ విచారణలో వెల్లడైంది. ఒక్కొక్కరికి రూ.30 వేల వరకు డబ్బు ఆశ చూపించి ఈ ప్రక్రియకు ఒప్పిస్తున్నట్లు గుర్తించారు. సాధారణంగా వైద్యపరమైన పర్యవేక్షణ, నిర్దిష్ట నిబంధనలు, మహిళల పూర్తి సమ్మతితో జరగాల్సిన అండాల సేకరణను కొందరు కాసుల కక్కుర్తితో దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంలో మరో దిగ్భ్రాంతికరమైన విషయం బాధితుల వివరాలు. మహిళా కమిషన్ విచారణ ప్రకారం, దాదాపు ఐదు నుంచి ఆరు రాష్ట్రాలకు చెందిన 50 మంది వరకు యువతులు ఈ ముఠా బారినపడినట్లు వెల్లడైంది. వీరిలో అత్యధికులు పెళ్లికాని యువతులే కావడం గమనార్హం. పేద కుటుంబాలకు చెందిన అమ్మాయిలను గుర్తించి, ఆర్థిక అవసరాలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నట్లు విచారణలో ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. అంతేకాదు, బాధితుల వయసు, గుర్తింపు వివరాలను మార్చేందుకు ఆధార్ కార్డులను సైతం ఫోర్జరీ చేసినట్లు గుర్తించడం ఈ వ్యవహారం వెనుక ఎంత పక్కాగా నెట్‌వర్క్ పనిచేస్తోందో తెలియజేస్తోంది. ఈ మొత్తం దందాలో హుస్సేన్ అనే వ్యక్తి ప్రధాన సూత్రధారిగా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అతడిని గుర్తించి పట్టుకోవాలని మహిళా కమిషన్ పోలీసులను ఆదేశించింది. అంటే ఇది ఒకరిద్దరు వ్యక్తులు చేస్తున్న చిన్నస్థాయి మోసం మాత్రమే కాదని, బాధితులను గుర్తించడం నుంచి ఆసుపత్రులకు తీసుకెళ్లడం, వైద్య ప్రక్రియ నిర్వహించడం వరకు వివిధ స్థాయిల్లో వ్యక్తులు పనిచేస్తున్న వ్యవస్థగా అనుమానాలు బలపడుతున్నాయి. మరోవైపు ఈ వ్యవహారంలో ఐదు ఫెర్టిలిటీ కేంద్రాల పాత్రపై కూడా మహిళా కమిషన్ తీవ్రంగా దృష్టిసారించింది. శారద, నర్మద, ఓయాసిస్, ఏఆర్‌టీ, ఇందిర ఫెర్టిలిటీ కేంద్రాలకు నోటీసులు జారీ చేసి, వాటి రికార్డులను పరిశీలించింది. ఈ తనిఖీల్లో కనీస రిజిస్ట్రేషన్ పత్రాలు, మహిళల సమ్మతికి సంబంధించిన అవసరమైన డాక్యుమెంట్లు అందుబాటులో లేకపోవడాన్ని కమిషన్ తీవ్రంగా పరిగణించింది. విచారణకు బాధ్యులైన యాజమాన్య ప్రతినిధులు స్వయంగా హాజరుకాకుండా కిందిస్థాయి సిబ్బందిని పంపడంపై ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద అసహనం వ్యక్తం చేశారు. పూర్తి రికార్డులతో ఈ నెల 13న మరోసారి విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే, ఫెర్టిలిటీ కేంద్రాలు వైద్యపరమైన సేవలు అందించే సంస్థలు కాబట్టి వాటి బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుంది. మహిళలకు చికిత్స అందించే క్రమంలో వారి ఆరోగ్యం, భద్రత, సమ్మతి, గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ ఈ ప్రాథమిక అంశాలపైనే అనుమానాలు వ్యక్తమవుతుండటం వైద్య రంగంలో పర్యవేక్షణ వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉందనే అంశంపై చర్చకు దారితీస్తోంది. ఇక వైద్యపరమైన ఉల్లంఘనల కోణంలోనూ విచారణ కొనసాగుతోంది. డీఎంహెచ్‌వో శ్రీనివాస్ పరిశీలనలో అర్హత కలిగిన వైద్యుల పర్యవేక్షణ లేకుండా హార్మోన్ ఇంజెక్షన్లు ఇవ్వడం, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించకపోవడం వంటి తీవ్రమైన ఆరోపణలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. అండాల సేకరణ అనేది సాధారణ ప్రక్రియ కాదు. మహిళల శరీరంలో హార్మోన్ల మార్పులు కలిగించే మందులు, ఇంజెక్షన్లు ఉపయోగించాల్సి ఉంటుంది. అందువల్ల వైద్యుల పర్యవేక్షణ లేకుండా ఈ ప్రక్రియ నిర్వహిస్తే ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. తాత్కాలికంగా డబ్బు అందుతుందనే ఆశతో ముందుకొచ్చిన యువతులు, దీర్ఘకాలంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యల గురించి పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉన్నారా అనే అంశం కూడా కీలకంగా మారింది. బ్రోకర్లు, ఏజెంట్లు, మధ్యవర్తులు ఈ నెట్‌వర్క్‌లో ఎలాంటి పాత్ర పోషించారు, యువతులను ఎవరు గుర్తించారు, ఏ కేంద్రాలకు తీసుకెళ్లారు, వారికి ఇచ్చిన డబ్బు వెనుక ఎవరున్నారు అనే విషయాలపై కూడా సమగ్ర దర్యాప్తు అవసరమవుతోంది. మొత్తంగా హైదరాబాద్‌లో బయటపడిన ఈ వ్యవహారం మహిళల ఆరోగ్య భద్రతతో పాటు వైద్య వ్యవస్థలోని పర్యవేక్షణ లోపాలను కూడా వెలుగులోకి తెస్తోంది. మహిళా కమిషన్ ఇప్పటికే ఐదు ఫెర్టిలిటీ కేంద్రాలకు నోటీసులు జారీ చేయడంతో పాటు, పోలీసుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా నివేదిక కోరాలని నిర్ణయించింది. ఈ విచారణ ద్వారా మరిన్ని కేంద్రాల వ్యవహారాలు బయటపడే అవకాశం ఉంది. అయితే నోటీసులు జారీ చేయడం, విచారణ చేపట్టడంతోనే బాధ్యత పూర్తయిపోదు. బాధితులకు న్యాయం జరగడం, అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవడం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన పర్యవేక్షణ ఏర్పాటు చేయడం అత్యంత అవసరం. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మహిళలకు సరైన అవగాహన కల్పించడంతో పాటు, ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడే ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. వైద్య సేవలు వ్యాపారంగా మారినా, మహిళల శరీరాలు మాత్రం కాసుల సంపాదనకు సాధనాలు కాకూడదు. హైదరాబాద్‌లో వెలుగుచూసిన ఈ అక్రమ అండాల దందాపై సమగ్ర విచారణ జరిగి, తెరవెనుక ఉన్న అసలు నెట్‌వర్క్ మొత్తం బయటపడితేనే ఇలాంటి చీకటి వ్యాపారాలకు అడ్డుకట్ట పడుతుంది.



లంచాలకు మరిగారా



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్‌లో పోలీసుల తీరుపై సీపీలు గరమయ్యారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో కేవలం వారం రోజుల్లో మూడు ఘటనలు, అవి కూడా పోలీసుల దారిదోపిడీ, బెదిరింపులకు పాల్పడడం వంటివి కావడంతో సీపీ సజ్జనార్ మంగళవారం కమిషనరేట్ అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో సీరియస్ అయ్యారు. అదే విధంగా కీసరలో వరుసగా రెండుసార్లు ఏసీబీకి పోలీసులు లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడడంతో మల్కాజిగిరి సీపీ సుమతి కూడా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు కమిషనరేట్లలో కొందరు పోలీసుల ప్రవర్తన, వారి చర్యలు కమిషనరేట్లకే తలవంపులు తెచ్చేలా ఉన్నాయని, ఇలా జరిగితే తాము సహించేది లేదని, కచ్చితంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో, నిజాయితీగా పనిచేయాలన్నారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు స్టేషన్ అధికారులు ఎప్పటికప్పుడు తమ పరిధిలో అధికారాలన్నీ వినియోగించుకుని అవసరమైతే ఎక్కడా రాజీ పడకుండా అక్రమార్కుల విషయాలను తమ దృష్టికి తీసుకురావాలంటూ.. ఇరువురు కమిషనర్లు తమ అధికారులకు సూచించారు. ప్రధానంగా ఇటీవల జూబ్లీహిల్స్ జోన్‌లోనే ఎక్కువగా ఇలాంటి దోపిడీలు, ముడుపులకు సంబంధించిన వ్యవహారాలు జరగడంతో సీపీ సజ్జనార్ ఆ జోన్ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి అసలు జోన్‌లో ఏం జరుగుతుందో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ఒకరిద్దరు అధికారులు వేరే కేసులతో బిజీగా ఉంటే వారి బాధ్యతలు ఎవరు నిర్వర్తిస్తున్నారో తెలుసుకోవాలంటూ సూచించారు. చాలా ముఖ్యమైన ప్రాంతంలో ఇటువంటి అక్రమాలు జరగడంతో తమకు చాలా ఇబ్బందిగా ఉంటుందన్నదని సీపీ టెలీకాన్ఫరెన్స్‌లో చెప్పారు.

పీఎస్‌ల ముందు దుకాణాలు తెరిచారా..!

హైదరాబాద్‌లో వరుసగా జరుగుతున్న సంఘటనలపై సీపీ సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా గత వారం రోజుల్లోనే మూడు ఘటనలు అవి కూడా సామాన్యుల దగ్గర డబ్బులు బలవంతంగా తీసుకున్న పోలీసుల తీరును ఎండగట్టారు. ఫిల్మ్‌నగర్ పోలీసులు ఏం చేస్తున్నారని, అసలు దారిదోపిడీ చేసే స్థాయిలో లూటీ జరుగుతున్నదంటే వ్యవస్థ పూర్తిగా కంట్రోల్ తప్పిందంటూ సజ్జనార్ అన్నారు. సైఫాబాద్‌లో వెహికల్ చెకింగ్ పేరుతో చిన్నచిన్న వసూళ్లు, సనత్‌నగర్ బండి గుంజుకుని పోవడం.. ఇదంతా ఏంటంటూ ఆయన ప్రశ్నించారు. ఈ మూడు ఘటనలతో హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌కే చెడ్డ పేరు తెచ్చారని, అసలు కమిషనరేట్‌లో స్టేషన్ అధికారులకు ఆయా స్టేషన్లు కంట్రోల్‌లో ఉన్నాయా అంటూ అడిగారు. ఇటీవల తాను ఓ ఫంక్షన్‌కు వెళ్తే..అక్కడ తెలిసిన వాళ్లు కొందరు తనతో మాట్లాడారని.. 'మీ వాళ్లు.. మా దగ్గరికి వచ్చి మేం నలుగురం ఉన్నాం.. పటాకులు కావాల'ని అడిగారంటూ..చెబితే.. తనకు తలకొట్టేసినట్లయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'మీరు పోలీసులయి ఉండి ఈ రకంగా బెగ్గింగ్‌కు దిగడం ఏమాత్రం బాగలేదు' అని.. అడుక్కుని తింటూ.. ఉద్యోగాలు చేయాల్సిన అవసరం లేదంటూ.. సీపీ మండిపడ్డారు. పెట్రోలింగ్‌కు ఎవరు వెళ్తున్నారు.. మీ స్టేషన్‌లో పనిచేస్తున్న వారు స్టేషన్‌ముందే దుకాణాలు పెట్టుకుని డబ్బులు వసూలు చేస్తుంటే ఎస్‌హెచ్‌వోలు ఏం చేస్తున్నారంటూ ఫైరయ్యారు. పరిస్థితి కంట్రోల్ తప్పిందంటే.. అందుకు కారణం పై స్థాయి అధికారులేనని, దీనిపై ప్రతీ ఒక్కరూ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మూడు ఘటనల్లో ఒక దగ్గర హోంగార్డు ఒకరు పది సంవత్సరాల నుంచి ఒకేచోట పనిచేస్తున్నారని, అలా పనిచేస్తున్న పరిస్థితి స్థానిక పీఎస్‌లో తెలిసి కూడా ఎందుకు అతనిని వేరే దగ్గరికి పంపించలేదని ఆ ఎస్‌హెచ్‌వోను అడిగారు. హోంగార్డులు లాంగ్‌స్టాండింగ్ ఉంటే వారిని వెంటనే మార్చాలని, ఎట్టి పరిస్థితుల్లో వారిని సమయాన్ని దాటి ఉంచొద్దంటూ ఆదేశించారు.

చెత్తకుప్పలో కాకతీయ శిల్పసంపద

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

జక్కిలేరులో కాకతీయుల కాలం నాటి అరుదైన నంది విగ్రహం వెలుగులోకి వచ్చింది. సుమారు 800 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ అద్భుత శిల్పం ప్రస్తుతం రోడ్డు పక్కన ముళ్ల పొదలు, చెత్తాచెదారం మధ్య నిరాదరణకు గురవుతోంది. ఒకప్పుడు ఆలయ మండపంలో భక్తుల పూజలు అందుకున్న ఈ నంది.. ఇప్పుడు కనీస రక్షణ కూడా లేకుండా పడి ఉండటం చరిత్ర ప్రేమికులను ఆవేదనకు గురిచేస్తోంది. నారాయణపేట జిల్లా మఖ్తల్ మండలం జక్కిలేరు గ్రామంలో కనిపించిన ఈ దృశ్యం కాకతీయుల కాలం నాటి అపురూప వారసత్వ సంపదకు మనం ఇస్తున్న ప్రాధాన్యతపై చర్చకు దారితీస్తోంది. వందల ఏళ్ల క్రితం నాటి శిల్పకళా వైభవం కళ్లముందే ఉన్నప్పటికీ, దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంత ఉందో ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది. జక్కిలేరు గ్రామంలో ఉన్న ఈ నంది విగ్రహం 13వ శతాబ్దానికి చెందినదిగా పురావస్తు పరిశోధకుడు ఈ. శివనాగిరెడ్డి వెల్లడించారు. కాకతీయుల కాలంలో నిర్మించిన ప్రసిద్ధ త్రికూటాలయం లోని రంగమండపంలో ఈ శిల్పాన్ని ప్రతిష్ఠించినట్లు తెలిపారు. త్రికూటాలయం అంటే ఒకే ప్రాంగణంలో మూడు ఆలయాలు ఉండే ప్రత్యేక నిర్మాణం. అప్పట్లో ఆలయ నిర్మాణాలు కేవలం పూజలకు మాత్రమే



పరిమితం కాకుండా శిల్పకళకు కూడా నిలయాలుగా ఉండేవి. అలాంటి చారిత్రక కట్టడంలో భాగంగా ఉన్న నంది విగ్రహం కాలక్రమంలో ఆలయానికి దూరమైంది. గతంలో కొందరు దుండగులు ఆలయంలోని విగ్రహాలను ధ్వంసం చేసిన సమయంలో నందిని కూడా రెండు ముక్కలుగా విరిచి బయట పడేసినట్లు శివనాగిరెడ్డి వివరించారు. దీంతో శతాబ్దాల చరిత్ర కలిగిన ఒక అపురూప కళాఖండం తన అసలు స్థానాన్ని కోల్పోయి నిర్లక్ష్యం మధ్య మిగిలిపోయింది. ఈ నంది విగ్రహం ప్రత్యేకత దాని పరిమాణంలోనే కాదు, చెక్కిన విధానంలోనూ దాగి ఉంది. సుమారు 5 అడుగుల పొడవు, 3 అడుగుల వెడల్పు, 3.5 అడుగుల ఎత్తుతో ఉన్న ఈ శిల్పాన్ని అరుదైన నల్లరాతితో రూపొందించారు. నంది శరీర ఆకృతి, ముఖ కవళికలు, ఆభరణాల అలంకరణలో కాకతీయ శిల్పుల పనితనం స్పష్టంగా కనిపిస్తుంది. రాయిని సాధారణ ఆకృతిలో మలచకుండా, ప్రతి భాగానికి ప్రత్యేకమైన రూపాన్ని ఇచ్చారు. ఆ కాలంలో శిల్పులు జంతువుల శరీర నిర్మాణాన్ని ఎంత నిశితంగా గమనించేవారో ఈ విగ్రహం తెలియజేస్తోంది. ముఖ్యంగా నల్లరాతిపై చేసిన సున్నితమైన చెక్కడాలు చూపరులను ఆకట్టుకునేలా ఉన్నాయి. దాదాపు ఎనిమిది శతాబ్దాలు గడిచినా శిల్పంలోని కళాత్మకత చెక్కుచెదరకుండా ఉండటం విశేషం. కాకతీయుల కాలం నాటి నిర్మాణ నైపుణ్యం, కళాభిరుచి, సృజనాత్మకతకు ఈ నంది ఒక విలువైన ఆనవాలుగా నిలుస్తోంది. ఇంతటి అరుదైన శిల్పం రోడ్డు పక్కన ముళ్ల పొదలు, మురికి కుప్పల మధ్య ఉండటం దాని భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తోంది. వాతావరణ ప్రభావం, మానవ నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికే రెండు ముక్కలుగా ఉన్న విగ్రహం మరింత దెబ్బతినే ప్రమాదం ఉంది. ఒకసారి ఇలాంటి పురాతన శిల్పం పూర్తిగా ధ్వంసమైతే దాన్ని తిరిగి పూర్వస్థితికి తీసుకురావడం అంత సులభం కాదు. అందుకే ఈ నందిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాల్సిన అవసరం ఉంది. విగ్రహాన్ని యథాతథంగా భద్రపరచడంతో పాటు, దాని అసలు రూపానికి ఎలాంటి నష్టం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి ప్రతిష్ఠిస్తే స్థానికులు దాన్ని సందర్శించేందుకు, దాని చరిత్రను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. వారసత్వ సంపదను కాపాడటం అంటే కేవలం రాళ్లను సంరక్షించడం కాదు, వాటి వెనుక ఉన్న తరాల చరిత్రను నిలబెట్టడం కూడా. శివనాగిరెడ్డి సూచనలతో గ్రామస్థులు కూడా ఈ నంది విగ్రహాన్ని కాపాడేందుకు ముందుకు రావడం సానుకూల పరిణామం. రెండు ముక్కలుగా ఉన్న శిల్పాన్ని జాగ్రత్తగా ఆలయ ప్రాంగణానికి తరలించి, ప్రత్యేక వేదికపై భద్రపరచాలని ఆయన సూచించారు. అంతేకాకుండా విగ్రహం ఏ కాలానికి చెందినది, దాని ప్రత్యేకతలు ఏమిటి అనే వివరాలతో సమాచార ఫలకాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల భవిష్యత్తులో గ్రామానికి వచ్చే సందర్శకులు, విద్యార్థులు ఈ చారిత్రక సంపద గురించి తెలుసుకునే అవకాశం ఉంటుంది. గ్రామస్థులు సైతం 800 ఏళ్ల నాటి నందిని భద్రపరుస్తామని హామీ ఇచ్చారు. అయితే ఈ ప్రయత్నం గ్రామానికే పరిమితం కాకుండా పురావస్తు శాఖ, స్థానిక అధికారులు కూడా తగిన చర్యలు తీసుకుంటే మరింత ప్రయోజనం ఉంటుంది. కాకతీయుల వైభవాన్ని పుస్తకాల్లో చదవడమే కాకుండా, ఇలాంటి శిల్పాల రూపంలో భావితరాలకు అందించడం మనందరి బాధ్యత.

కూరగాయల క్షేత్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్



విశాలభారతి, గూడూరు: మంగళవారం గూడూరు మండల పరిధిలోని ఎల్నినో ప్రభావం నేపథ్యంలో భూపతిపేట/వెంగంపేట రైతువేదికలో ఉద్యానవన,పట్టుపరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతు అవగాహన సదస్సులో ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ స్నేహశబరిష్ రైతులకు పలు సూచనలు తెలియజేసారు, భూగర్భ జలాలు పెంచడానికి పెద్ద రైతులు పీబీజీరాంజీ ఆధ్వర్యంలో ఫామ్ ఫాండులు నిర్మించుకోవాలని, తీవ్ర నీటికొరత ప్రభావం వల్ల పరికి బదులుగా తక్కువనీటీ లభ్యతతో పండి,అధిక దిగుబడివచ్చే కూరగాయలు, పండ్ల తోటలు సాగుచేయాలని, ప్రస్తుతం కరెంటు, సాగునీటిసమస్యలు భవిష్యత్తు లో మరింత పెరిగే అవకాశం ఉన్నందున తక్కువ కరెంట్, నీటివాడకంతో అధిక లాభాలు వచ్చే పప్పుదినుసులు, కూరగాయలు సాగుచేయడం వల్ల రైతులు సంతోషంగా ఉండడంతోపాటు,కూరగాయలు సాగు చేయడం వల్ల మన ప్రాంతంతోబాటు జిల్లా,రాష్ట్ర స్థాయిలో పోషకాలు కూరగాయల ద్వారా అందించిన వారుకావొచ్చు అన్నారు,మన రాష్ట్రంలో బియ్యం నిలువలు అవసరమయినా దానికంటే ఎక్కువగా ఉన్నందున, రాబోయే కాలంలో వరి సాగ తగ్గించి,కూరగాయల సాగు పెంచాలని రైతులని కోరారు.....ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన, వ్యవసాయ,ఎలక్ట్రిసిటీ, అధికారులు,గూడూరు తహసీల్దార్,మండల వివిధ శాఖల అధికారులు,భూపతిపేట, వెంగంపేట,సీతానగరం, చిన్నఎల్లపురం గ్రామ సర్పంచులు,ఉపసర్పంచ్ లు, వివిధ గ్రామ రైతులు పాల్గొన్నారు

యస్ బి ఐ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వ్యాపార నైపుణ్య శిక్షణ



మోతె, విశాలభారతి: మంగళవారం మండల కేంద్రంలో పల్లెల పరివర్తన సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వ్యాపార నైపుణ్య శిక్షణ నిర్వహించడం జరుగిందని సొసైటీ చైర్మన్ పల్లెల లక్ష్మణ్ చెప్పారు 18 సంవత్సరాల వయస్సు నుంచి యాభై సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలకు పురుషులకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు కేంద్రం ప్రభుత్వం సహకారం తో యస్ బి ఐ నల్లగొండ వారి సౌజన్యం తొ ఉచితంగా పది రోజులు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ ఉంటుందని మండలం లోని ప్రతి గ్రామానికి చెందిన దివ్యాంగులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు శిక్షణ లొ పాల్గొనే వారు తమ ఆధార్ కార్డు రేషన్ కార్డు సదరం సర్టిఫికెట్ బ్యాంకు అకౌంట్ జిరాక్స్ లు నాలుగు పాస్ ఫోటోలు వెంట తెచ్చుకోవాలని తెలిపారు

సీపీఎం పార్టీ లో చేరిన కుటుంబాలకు అండగా ఉంటాం

- ప్రజా పోరాటాలకు ఆకర్షితులై పార్టీలో చేరిన యువకులు
- ఎర్రజెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన .. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి



మోతె , విశాలభారతి: మండలంలో సీపీఎం నిర్వహిస్తున్న ప్రజా పోరాటాలకు ఆకర్షితులై యువకులు సీపీఎం పార్టీలో చేరడం ఆశించదగిన పరిణామమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మామిళ్లగూడెం గ్రామంలో చింతమల్ల రాజు నాయకత్వంలో 10 కుటుంబాలకు చెందిన యువకులు వివిధ పార్టీలకు రాజీనామా చేసి సీపీఎం పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి , జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు వారికి ఎర్ర జెండాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మల్లు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ సీపీఎం పార్టీ నిరంతరం కష్టజీవుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరంతరం పోరాడుతున్నట్లు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ ఆర్థిక అసమానతలు కొనసాగుతుండటంతో దేశం అభివృద్ధిలో వెనుకబడుతోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా యువత ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మండలంలో సీపీఎం బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతోందని పార్టీలో చేరిన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ నెల 15న నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు మోతే మండలం నుంచి రైతాంగం అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం గ్రామ కార్యదర్శి షేక్ జహీనాభి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు సీపీఎం మండల కమిటీ సభ్యులు నాగం మల్లయ్య చర్లపల్లి మల్లయ్య డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి వెలుగు మధు డీవైఎఫ్ఐ నాయకులు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అఖిలభారత మహాసభలను జయప్రదం చెయ్యండి : బుర్రి శ్రీరాములు



మునగాల: విశాల భారతి : నవంబర్ 15వ తారీఖున లక్షలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని ఈ సభను విజయవంతం చేయాలని మునగాల మండల కేంద్రంలో రైతు సంఘం సిపిఎం పార్టీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మునగాల మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు కౌ ద్దార్ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ సైదా మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జూలకంటి విజయలక్ష్మి మునగాల మండల రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు చందా చంద్రయ్య స్టాలిన్ రెడ్డి సుంకరి పిచ్చయ్య జానయ్య కృష్ణారెడ్డి కిన్నెర వెంకన్న వినోదు వీరబోయిన వెంకన్న వట్టేపు చిన్న సైదులు తదితరులు పాల్గొన్నారు

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

- సెవెన్ హిల్స్ వైన్స్ పక్కన అపస్మారక స్థితిలో గుర్తింపు
- మృతుడి వయస్సు సుమారు 27 ఏళ్లు.. ఆచూకీ కోసం పోలీసుల ప్రయత్నం

విశాల భారతి, ఎల్ బి నగర్: హయత్‌నగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. 2026 నవంబర్ 3వ తేదీ రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో హయత్‌నగర్‌లోని సెవెన్ హిల్స్ వైన్స్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో సుమారు 27 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి పడి ఉన్నట్లు డయల్ 100 ద్వారా సమాచారం అందింది. వెంటనే బ్లూ కోల్ట్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించగా, ఆ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. అతను తెలుపు రంగు జీన్స్ ప్యాంట్, పిస్తా రంగు చొక్కా ధరించి ఉన్నాడు. అనంతరం అంబులెన్స్‌లో ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించి MLC నం.37167 కింద చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ నవంబర్ 9వ తేదీ ఉదయం 9:15 గంటలకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు, ఆచూకీ ఇంకా తెలియరాలేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై క్రైమ్ నం.1749/2026, సెక్షన్ 194 BNSS కింద కేసు నమోదు చేసి చట్టప్రకారం తదుపరి చర్యలు చేపడుతున్నట్లు హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య వివరాలు వెల్లడించారు. మృతుడిని గుర్తించేందుకు తెలిసినవారు లేదా బంధువులు పోలీసులను సంప్రదించాలని కోరారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉద్రిక్తత

- బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థుల అరెస్టు
- అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజశ్రీకి సంఘీభావంగా మాజీ మంత్రుల పర్యటన.. వీసీ జానయ్యకు వ్యతిరేకంగా నిరసన

రాజేంద్రనగర్, విశాల భారతి:



రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణల వ్యవహారం తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. ఈ ఘటనకు సంబంధించి బాధితురాలు అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజశ్రీకి న్యాయం చేయాలని, ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో విశ్వవిద్యాలయానికి చేరుకున్నారు. బాధితురాలికి అండగా నిలుస్తూ సంఘీభావం ప్రకటించేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో విశ్వవిద్యాలయ పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, సత్యవతి రాథోడ్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చేరుకుని అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజశ్రీకి సంఘీభావం తెలిపారు. వీసీ ప్రొఫెసర్ జానయ్యకు వ్యతిరేకంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయంలో చోటుచేసుకున్న పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, మహిళా అధ్యాపకురాలికి న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు బాధితురాలికి మద్దతుగా విశ్వవిద్యాలయానికి చేరుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులను పోలీసులు ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని సైతం పోలీసులు అరెస్టు చేశారు. సంఘీభావం తెలిపేందుకు వచ్చిన వారిని అరెస్టు చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతూ విద్యార్థులు, రాజకీయ నాయకులు ఒకవైపు నిరసన చేపట్టగా, మరోవైపు పోలీసులు వారిని అడ్డుకోవడంతో కొంతసేపు విశ్వవిద్యాలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనతో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నెలకొన్న వివాదం మరింత చర్చనీయాంశంగా మారింది. మహిళా అధ్యాపకురాలిపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలను అధికారులు తీవ్రంగా పరిగణించి నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని, బాధితురాలికి న్యాయం చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై విశ్వవిద్యాలయ యాజమాన్యం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పోలీసుల అరెస్టులతో రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వద్ద రాజకీయ వాతావరణం వేడెక్కింది.

శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయం నూతన అధ్యక్షుడిగా గోవర్ధన్ రెడ్డి



చౌటుప్పల్, విశాల భారతి:

పట్టణ కేంద్రంలో మంగళవారం దేవాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏకగ్రీవంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగింది. చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ సమక్షంలో.దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు బొబ్బిళ్ల మురళి గురు స్వామి మరియు మాజీ దేవాలయ అధ్యక్షులు కామిశెట్టి భాస్కర్,మాజీ దేవాలయ ప్రధాన కార్యదర్శి చింతల సాయిలు పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శ్రీమతి మొగుదాల పావని రమేష్ గౌడ్ నూతన అధ్యక్షుడిగా దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి ని మరియు ప్రధాన కార్యదర్శిగా తూర్పాటి శంకర్ ని ప్రకటించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ,దేవాలయ నిర్మాణ సమయంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణం జరిగింది. నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించే సమయంలో అందర్నీ కలుపుకొని ఆలయ అభివృద్ధి చేయాలి.మా వంతుగా మున్సిపల్ పాలకవర్గం దేవాలయ అభివృద్ధి విషయంలో ఎప్పుడూ మీకు అండగా ఉంటుంది. దేవాలయ నిర్మాణం కొరకు కృషి చేసిన ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నాను. దేవాలయ అభివృద్ధి విషయంలో నా వ్యక్తిగత సహకారం కూడా ఎల్లప్పుడూ ఉంటుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ సలహాదారులు దాచేపల్లి ప్రకాష్ గుప్తా, అయ్యప్ప స్వామి విగ్రహ దాత కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, కంచర కుంట్ల వెంకటరెడ్డి, ఉప్పు ఆంజనేయులు, అంతటి రాము గౌడ్, తాడూరు పరమేష్, పెద్ద గోని రమేష్ గౌడ్, ముత్యాల ప్రభాకర్ రెడ్డి, ఎలుగుబెల్లి అనిల్, కర్నాటి శ్యాంప్రసాద్, సుక్క సుదర్శన్, డాక్టర్ అనిల్, తిరందాసు జగన్నాథ్, బొడ్డు రాజేందర్ రెడ్డి, మలిగే శ్రీను, తూర్పునూరు నరసింహ గౌడ్, శశి, బోరం ప్రకాష్ రెడ్డి, దేవాలయ అర్చకులు ఓంకార్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో కట్టారి వినోద్ కుమార్‌కు కీలక బాధ్యతలు

- రాష్ట్ర ఐటీ కో-కన్వీనర్‌గా నియామకం
- పట్టభద్రుల ఓటర్ల నమోదు సమన్వయ కమిటీలోనూ చోటు

రాజేంద్రనగర్,విశాల భారతి:




తెలంగాణలో ఐటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందిన ఫోరం ఫర్ ఐటీ ఎంప్లాయీస్ (ఎఫ్ఐటీఈ) అధ్యక్షుడు కట్టారి వినోద్ కుమార్‌కు భారతీయ జనతా పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. ఆయన సేవలు, ఐటీ రంగంపై ఉన్న అవగాహన, యువతతో పాటు ఐటీ ఉద్యోగుల్లో ఉన్న పరిచయాలను గుర్తించిన పార్టీ రాష్ట్ర నాయకత్వం బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఐటీ కోకన్వీనర్‌గా నియమించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ కోకన్వీనర్‌గా నియమితులైన కట్టారి వినోద్ కుమార్ బీజేపీ తెలంగాణ సహ ఇన్‌చార్జి, బెల్గాం ఎమ్మెల్యే అభయ్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. తనకు కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో బీజేపీ ఐటీ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ఐటీ ఉద్యోగులు, యువతలో పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచందర్ రావును కూడా మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల నమోదు కార్యక్రమానికి సంబంధించిన సమన్వయ కమిటీ సభ్యుడిగా కూడా కట్టారి వినోద్ కుమార్‌కు పార్టీ అవకాశం కల్పించింది. ఈ బాధ్యతల్లో భాగంగా అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించడం, పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకోవడం, ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో ఆయన కీలకంగా వ్యవహరించనున్నారు. ఒకేసారి రెండు కీలక బాధ్యతలు దక్కడం పట్ల పార్టీ శ్రేణులు, ఐటీ ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. తనకు ఈ అవకాశం కల్పించిన బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి కట్టారి వినోద్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి, ఐటీ ఉద్యోగులు, యువతను పార్టీకి మరింత చేరువ చేయడానికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.

కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన చిర్రా రవీందర్ యాదవ్

- దీపావళి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకుడు
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.. కేటీఆర్ సూచన

శేరిలింగంపల్లి - విశాల భారతి



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఉద్యమకారుడు, బీఆర్ఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకుడు చిర్రా రవీందర్ యాదవ్ మంగళవారం తెలంగాణ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ భేటీలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు తీరుపై చర్చించినట్లు రవీందర్ యాదవ్ తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించినట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కేటీఆర్ దిశానిర్దేశం చేసినట్లు వెల్లడించారు.

రంగారెడ్డి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా
- రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం చొరవ చూపాలి



విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్: రంగారెడ్డి జిల్లాను కరువు ప్రాంతంగా గుర్తించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన సీపీఐ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతు కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్న నేపథ్యంలో జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి, బాధిత రైతులకు తగిన పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ.. రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి వారికి అండగా నిలవాలని అన్నారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు సాగునీరు, పంట నష్టపరిహారం, ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీర హరిసింగ్ నాయక్, మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్‌తో పాటు మండల సీపీఐ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా సమావేశంలో రామ్‌రాజు

- రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశం
- ఓబీసీ మోర్చా బలోపేతంపై చర్చ




విశాల భారతి, ఎల్ బి నగర్: రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా అర్బన్ ఓబీసీ మోర్చా కార్యవర్గ సమావేశానికి రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు రామ్‌రాజు హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా సంస్థాగత బలోపేతం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఓబీసీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై నాయకులు చర్చించారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా కమిటీ సభ్యులు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంలో 10 కుటుంబాల చేరిక

- ప్రజా పోరాటాలకు ఆకర్షితులై పార్టీలో చేరిన యువకులు
- ఎర్రజెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

మోతే: విశాల భారతి : మోతే మండలంలో సీపీఎం నిర్వహిస్తున్న ప్రజా పోరాటాలకు ఆకర్షితులై యువకులు సీపీఎం పార్టీలో చేరడం ఆశించదగిన పరిణామమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మామిళ్లగూడెం గ్రామంలో చింతమల్ల రాజు నాయకత్వంలో 10 కుటుంబాలకు చెందిన యువకులు వివిధ పార్టీలకు రాజీనామా చేసి సీపీఎంలో చేరారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు వారికి ఎర్రజెండాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మల్లు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ..సీపీఎం పార్టీ నిరంతరం కష్టజీవుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరంతరం పోరాడుతున్నట్లు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ ఆర్థిక అసమానతలు కొనసాగుతుండటంతో దేశం అభివృద్ధిలో వెనుకబడుతోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా యువత ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మోతే మండలంలో సీపీఎం బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతోందని, పార్టీలో చేరిన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ నెల 15న నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు మోతే మండలం నుంచి రైతాంగం అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం గ్రామ కార్యదర్శి షేక్ జహీనాభి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, సీపీఎం మండల కమిటీ సభ్యులు నాగం మల్లయ్య, చర్లపల్లి మల్లయ్య, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి వెలుగు మధు, డీవైఎఫ్ఐ నాయకులు గౌస్ తదితరులు పాల్గొన్నారు.



జీఎస్ఐ కేంద్రాల ప్రారంభోత్సవంలో నవజీవన్ రెడ్డి

- కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్ ముఖ్య అతిథులుగా హాజరు
- ఆధునిక శిక్షణా సదుపాయాలు ప్రారంభం

విశాల భారతి, ఎల్బీనగర్ :



భారతదేశంలో భౌగోళిక పరిశోధనలు, ఖనిజ వనరుల అన్వేషణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధిని బలోపేతం చేసే లక్ష్యంతో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (GSI) ఆధ్వర్యంలో నూతన శిక్షణ, సామర్థ్యాభివృద్ధి కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమం నవంబర్ 10న ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ దినేష్ వి. గన్వి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి చేతుల మీదుగా పలు అత్యాధునిక శిక్షణా సదుపాయాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇంటర్నేషనల్ హాస్టల్స్, అడ్వాన్స్‌డ్ జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్ లాబొరేటరీ, కర్మయోగి డిజిటల్ స్టూడియోలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

పరిశోధనలకు కొత్త ఊతం

ఈ నూతన సదుపాయాలు భౌగోళిక పరిశోధనలు, ఖనిజ వనరుల అన్వేషణ, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధికి ఎంతగానో దోహదపడనున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణ అందించడం ద్వారా ఖనిజ రంగంలో మరిన్ని అవకాశాలు ఏర్పడనున్నాయి.

పాల్గొన్న బీజేపీ నాయకులు

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎల్బీనగర్ బీజేపీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, నాగోల్ మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్తో పాటు అధికారులు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో చైన్ స్నాచింగ్

- నిందితుడి కోసం ఫ్యూచర్ సిటీ పోలీసుల గాలింపు
- నిందితుడిని పట్టుకునేందుకు సీసీటీవీ ఫుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు



విశాలభారతి ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పట్టణంలో మంగళవారం సాయంత్రం ఓ మహిళ మెడలో నుంచి బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని గుర్తుతెలియని వ్యక్తి పరారయ్యాడు. ఈ ఘటనపై ఫ్యూచర్ సిటీ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే ఇబ్రహీంపట్నానికి చెందిన ఐతరాజు అనురాధ (40) తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా, పట్టణంలోని మార్కురీ సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న సుమారు 2.5 తులాల బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని పరారయ్యాడు. సాయంత్రం సుమారు 6:50 గంటలకు ఫిర్యాదు అందడంతో ఇబ్రహీంపట్నం పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. నిందితుడిని గుర్తించేందుకు సమీపంలోని సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు.ఇబ్రహీంపట్నం ఎస్‌హెచ్ఓ ఎం. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, నిందితుడిని గుర్తించి పట్టుకునేందుకు సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తూ వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఘటనపై కేసు నమోదు ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. నిందితుడిని గుర్తించి పట్టుకునేందుకు ఫ్యూచర్ సిటీ పోలీసులు చర్యలు కొనసాగిస్తున్నారు.

సదర్ వేడుకల్లో నవజీవన్ రెడ్డి సందడి

- యాదవ, కురుమ సోదరుల సంప్రదాయాలకు అభినందనలు
- సంస్కృతి, ఐక్యతను భావితరాలకు అందించాలి



విశాల భారతి, ఎల్ బి నగర్ : దీపావళి పండుగను పురస్కరించుకొని హయత్‌నగర్‌లో యాదవ సోదరులు ఘనంగా నిర్వహించిన సదర్ సమ్మేళన వేడుకల్లో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదవ, కురుమ సోదరులు సంప్రదాయబద్ధంగా దున్నపోతులను అందంగా అలంకరించి, డప్పు చప్పుళ్ల నడుమ నిర్వహించిన వేడుకలను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. సదర్ సమ్మేళనం యాదవ సోదరుల ఐక్యతకు, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఇలాంటి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యాదవ, కురుమ సోదరుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉగాది కాంప్లెక్స్ వద్ద ఉగాది కుటుంబ సభ్యులు నిర్వహించిన సదర్ సమ్మేళన కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొని వేడుకల్లో పాల్గొన్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు జనార్ధన్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఉగాది బాలు, బీజేవైఎం నాయకులు ఎర్ర ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిపిన లారీని ఢీకొన్న ఆటో.. మహిళ మృతి

- మరో ఇద్దరికి గాయాలు.. సంగం హోటల్ సమీపంలో ప్రమాదం

విశాల భారతి, ఎల్ బి నగర్: రోడ్డుపై ఎలాంటి హెచ్చరిక సూచికలు లేకుండా నిర్లక్ష్యంగా నిలిపి ఉంచిన లారీని ఆటో ఢీకొట్టడంతో మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడిన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీస్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య వివరాల ప్రకారం..నవంబర్ 9న ఉదయం సుమారు 6:50 గంటల సమయంలో భగ్యత నుంచి పెద్ద అంబర్‌పేట్ వైపు స్క్రాప్ సామానుతో ఆటో నంబర్ TG07UG3243లో యదవల్లి పద్మ (26), రెవెల్లి దుర్గమ్మ ప్రయాణిస్తున్నారు. సంగం హోటల్ సమీపానికి చేరుకోగానే రోడ్డుపై ఎలాంటి ఇండికేటర్లు, హెచ్చరిక సూచికలు లేకుండా నిలిపి ఉంచిన లారీ నంబర్ TG05T7289ను ఆటో ఢీకొట్టింది.

ఘటనా స్థలంలోనే మహిళ మృతి

ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న యదవల్లి పద్మ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. రెవెల్లి దుర్గమ్మకు భుజం వద్ద తీవ్ర గాయాలు కాగా, ఆటో డ్రైవర్‌కు కూడా రక్తగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా నీలాద్రి ఆసుపత్రికి తరలించారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

ఈ ఘటనపై యదవల్లి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శంకరయ్య తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీని నిర్లక్ష్యంగా రోడ్డుపై నిలిపి ఉంచిన డ్రైవర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు తదుపరి విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.

గురుకుల హాస్టల్‌లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



- విద్యార్థుల సమస్యలపై ఆరా
- మౌలిక వసతులు వెంటనే మెరుగుపరచాలని అధికారులకు ఆదేశం

విశాల భారతి, ఎల్బీనగర్:

గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని జెడ్సీ కార్యాలయం వెనుక ఉన్న గురుకుల హాస్టల్‌ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలు, భోజన నాణ్యత, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో హాస్టల్‌లో తీవ్ర నీటి సమస్య ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థులు తాగునీటిని, ఇతర అవసరాలకు వినియోగించే నీటిని మూడో, నాలుగో అంతస్తులకు సైతం స్వయంగా తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మొత్తం 60 మూత్రశాలలకు కేవలం 8 మాత్రమే వినియోగంలో ఉండటాన్ని గమనించారు. మిగిలిన వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థుల సంక్షేమమే ప్రాధాన్యం

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని, హాస్టల్‌లో గుర్తించిన సమస్యలను తక్షణమే పరిష్కరించి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, రమేష్ ముదిరాజ్, బిచినేపల్లి వెంకటేశ్వరరావు, శ్రీశైలం యాదవ్, రమణారెడ్డి, గండి సన్నియాదవ్, కొత్త రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

నకిలీ ఉద్యోగ పత్రాలతో 30 లక్షల రూపాయల రుణం

- బ్యాంకును మోసం చేసిన ముఠా గుట్టురట్టు



విశాలభారతి ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ ఆధార్, పాన్ కార్డులు, ఉద్యోగ నియామక పత్రాలు, జీతపు స్లిప్పులు తయారు చేసి బ్యాంకు రుణం పొందిన మోసపూరిత వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సిఐ మహేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రామావత్ గోపాల్, పులి సురేష్ బాబు కలిసి గంటల శంకర్ పేరుతో నకిలీ గుర్తింపు ఉద్యోగ ధ్రువీకరణ పత్రాలు తయారు చేసినట్లు వెల్లడైంది. వాటి ఆధారంగా పులి సురేష్ బాబు, గంటల శంకర్ పేరుతో బెంగళూరులోని సిఎపిసిఓ టెక్నాలజీస్ కంపెనీలో సీనియర్ కన్సల్టెంట్‌గా ఉద్యోగం పొందినట్లు తెలిసింది. అనంతరం అదే నకిలీ పత్రాలను ఉపయోగించి రామావత్ సురేష్ ద్వారా ఐసీఐసీఐ బ్యాంకులో గంటల శంకర్ పేరుతో రూ.30 లక్షల రుణం మంజూరు చేయించుకున్నారు.ఈ రుణం మంజూరు చేయించినందుకు రామావత్ సురేష్‌కు రూ.6.70 లక్షలు కమిషన్‌గా చెల్లించినట్లు, నిందితులు పరస్పరం డబ్బులు పంచుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.గంటల శంకర్ పేరుతో క్రెడిట్ కార్డు పొందిన రామావత్ సురేష్, దానిపై ఉన్న రూ.3 లక్షల క్రెడిట్ పరిమితిని కూడా వినియోగించుకున్నట్లు తెలిసింది.ఈ వ్యవహారంలో నకిలీ పత్రాల తయారీ, వాటి ద్వారా ఉద్యోగం పొందడం, బ్యాంకు రుణం మంజూరు చేయించుకోవడం వంటి అంశాలపై ఇబ్రహీంపట్నం పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ప్రజలకు విజ్ఞప్తి

బ్యాంకు రుణాల కోసం నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించడం, ఇతరుల గుర్తింపు వివరాలను దుర్వినియోగం చేయడం చట్టరీత్యా నేరం. ఇలాంటి మోసాలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలి



- వ్యవసాయ రంగంలో స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలి
- రైతు ఉద్యమాలకు వేదిక కానున్న రైతు సంఘం అఖిలభారత మహాసభలు
- నవంబర్ 15న నల్లగొండలో జరిగే బహిరంగ సభకు వేలాదిగా తరలిరండి

భద్రాచలం, విశాల భారతి:

రైతులు పండించిన పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని, వ్యవసాయ రంగంలో స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ ఏ.జె. రమేష్ డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ విస్తృత స్థాయి జనరల్ బాడీ సమావేశం సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ ఎం.బి. నర్సారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏ.జె. రమేష్ మాట్లాడుతూ రైతులు అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటూ పంటలు పండిస్తున్నప్పటికీ, వారికి గిట్టుబాటు ధర లభించక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కాలంటే పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించాలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి కాపాడేందుకు స్వామినాథన్ కమిషన్ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కుల సాధన కోసం దేశవ్యాప్తంగా రైతు సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో రైతు సంఘం అఖిలభారత మహాసభలు రైతాంగ సమస్యలపై చర్చించి, భవిష్యత్తు రైతు ఉద్యమాలకు దిశానిర్దేశం చేసే వేదికగా నిలవనున్నాయని తెలిపారు. నవంబర్ 15వ తేదీన నల్లగొండలో నిర్వహించే భారీ బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాస్వామికవాదులు, పార్టీ కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు డి సీతాలక్ష్మి,పార్టీ సీనియర్ నాయకులు బిబిజి తిలక్, 20 వార్డు మెంబర్ ఇరప అనసూయ, పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి, అజయ్ కుమార్, కుంజా శ్రీనివాస్ చొక్కా మాధవరావు, ఏ రత్నం, కొలగాని రమేష్, తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదానం ప్రారంభం

- కొప్పుల నర్సింహారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- 10 క్వింటాళ్ల బియ్యం, 2 క్వింటాళ్ల కందిపప్పు విరాళం



విశాల భారతి, ఎల్ బి నగర్: మన్సూరాబాద్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాముల కోసం నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. నవంబర్ 10 నుంచి డిసెంబర్ 27 వరకు ప్రతిరోజూ ఈ అన్నప్రసాద వితరణ కొనసాగనుంది. ఈ కార్యక్రమానికి కొప్పుల నర్సింహారెడ్డి 10 క్వింటాళ్ల బియ్యం, 2 క్వింటాళ్ల కందిపప్పును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా 41 రోజుల పాటు నియమనిష్ఠలతో అయ్యప్ప మాల ధరించి దీక్ష చేపడుతున్న స్వాములను ఆయన అభినందించారు. అయ్యప్ప మాల ధరించిన ప్రభుత్వ ఉద్యోగులకు దీక్షా కాలంలో ప్రతిరోజూ ఒక గంట ముందుగా విధుల నుంచి వెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి కల్పించాలని కోరారు. రంజాన్ మాసంలో ముస్లిం ఉద్యోగులకు కల్పిస్తున్న వెసులుబాటు తరహాలో అయ్యప్ప దీక్ష చేపట్టిన ఉద్యోగులకు కూడా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అయ్యప్ప స్వాములందరూ ప్రతిరోజూ ఆలయంలో అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. ప్రతి సంవత్సరం భక్తి శ్రద్ధలతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను, కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విట్టల్ రెడ్డి, గ్రామ పెద్ద నాంపల్లి శంకరయ్య, అయ్యప్ప దేవాలయ కమిటీ సభ్యులు నగేష్ గురుస్వామి, పాల్‌చందర్, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

చెన్నారెడ్డి గూడలో ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు



విశాల భారతి ఇబ్రహీంపట్నం : మంచాల మండల పరిధిలోని చెన్నారెడ్డి గూడ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు గ్రామపంచాయతీ కార్యదర్శి శిరీష ఆధ్వర్యంలో మంచాల వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు ఇందిరమ్మ కమిటీ సభ్యులకు తో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు పూర్తిగా నిర్మాణం చేసుకున్న లబ్ధిదారుల ఇండ్ల వద్దకు వెళ్లి లబ్ధిదారులతో కలిసి వారి సమస్యలు తెలుసుకుని దీపాలు వెలిగించి అధికారులను శాలువాతో ఘనంగా సన్మానించి బాణాసంచా కాల్చి ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘం డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం ప్రవేశ పెట్టే అన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అమలయ్యేలా కృషి చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంబోతు కిషన్ నాయక్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ముచ్చర్ల వెంకటేష్ యాదవ్ వార్డు సభ్యులు రత్నావత్ హర్యనాయక్ కాట్రోత్ హర్య మంచర్ల క్రాంతి కుమార్ నెట్టు. బొరమ్మ కాట్రోత్ మధు నాయక్ అంబోటు లావణ్య మాజీ ఎంపీటీసీ లాలు నాయక్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎర్ర మోని శ్రీశైలం నెట్టు మంజుల గ్యార రాజు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పగడాల శ్రీశైలం కార్యదర్శి రాజు నాయకులు చీమల రమేష్ గ్యార పెంటయ్య నెట్టు వెంకటయ్య చీమల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరు

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవ
- మూడు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు గ్రీన్‌సిగ్నల్



విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ డివిజన్ 52లో పలు కాలనీల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నిధులు మంజూరు చేశారు. మైత్రి శ్రీపురం, హరితహారం, శ్రీలక్ష్మీ కుటీర్ కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఆయన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తూ సాంక్షన్ లెటర్ అందజేశారు. మైత్రి శ్రీపురం కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్, బీటీ రోడ్ల నిర్మాణంతో పాటు కమ్యూనిటీ హాల్‌పై లైబ్రరీ భవన నిర్మాణం చేపట్టనున్నారు. హరితహారం కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్, సీసీ రోడ్డు పనులు, శ్రీలక్ష్మీ కుటీర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం, ఓపెన్ జిమ్ పరికరాల ఏర్పాటు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే ఆయా కాలనీల ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. కాలనీల అభివృద్ధికి చొరవ తీసుకొని నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి స్థానిక నాయకులు, కాలనీ వాసులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గంట లక్ష్మారెడ్డి, చెరుకూరి రేణుక జగన్, కాలనీ అధ్యక్షుడు జిల్కపల్లి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికంగా నలుగురికి సాయపడాలి

- బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి

ముషీరాబాద్,విశాల భారతి: జీవితంలో ఆధ్యాత్మికంగా నలుగురికి ఉపయోగపడే విధంగా సాయపడాలని బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి పేర్కొన్నారు. ఈ మేరకు హనుమకొండలో విశ్వబ్రాహ్మణ జాతిరత్నం మద్దోజు కోదండరాములు ప్రభావతి దంపతుల 50 సంవత్సరాల వివాహ మహోత్సవం, కోదండరాములు 75వ జన్మదినం సందర్భంగా వసంతోత్సవ కార్యక్రమం శ్రీకర్, నిషా, మద్దోజు శ్రీహర్ష, స్రవంతి, శ్రావణి, రాజు దంపతుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గణేష్ చారి, జయలక్ష్మి, అరవింద్ కుమార్, హారిక, రాము, మానస, భరతమ్మ, జయేందర్ రెడ్డి హాజరై వారిని ఆశీర్వదించారు. అనంతరం గణేష్ చారి మాట్లాడుతూ 60 సంవత్సరాలుగా పోస్టల్ డిపార్ట్‌మెంట్లో కోదండరాములు సేవలు అందించి విరమణ పొందిన తర్వాత కూడా ఆధ్యాత్మికంగా నలుగురికి సహాయపడడం గొప్ప విషయమన్నారు. ఒక సంఘసంస్కర్తగా తన జీవితాన్ని స్వార్థకం చేసుకొని ఎంతోమందికి ఆదర్శంగా నిలబడ్డారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, రఘువీరారెడ్డి, రంగారావు, లింగమూర్తి, యాకుబ్ రెడ్డి, గణపతి రెడ్డి, లింగారెడ్డి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ నగర్‌లో పేకాట స్థావరంపై దాడి

- ఆరుగురు అరెస్ట్.. రూ.21 వేల నగదు స్వాధీనం
- 7 సెల్‌ఫోన్లు, 156 పేక ముక్కలు పట్టివేత

విశాల భారతి, ఎల్ బి నగర్: దత్తాత్రేయ నగర్‌లో డబ్బులు పందెంగా పెట్టి అక్రమంగా పేకాట ఆడుతున్న స్థావరంపై ఎస్ఓటీ ఎల్బీనగర్ బృందం, హయత్‌నగర్ పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య తెలిపారు.

నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం

ఇన్‌స్పెక్టర్ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసుల దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురి వద్ద నుంచి రూ.21,210 నగదు, నేలపై ఉన్న మూడు సెట్లకు చెందిన 156 పేక ముక్కలు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

జూదానికి దూరంగా ఉండాలి

డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడటం చట్ట విరుద్ధమని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని ఇన్‌స్పెక్టర్ సూచించారు. తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా పేకాట లేదా ఇతర జూద కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు 8712662640 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, అక్రమ జూద కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ శంకరయ్య తెలిపారు.

రిఫ్రిజిరేటర్ కంప్రెషర్ పేలి ఇంట్లో భారీ అగ్నిప్రమాదం

రాజేంద్రనగర్,విశాల భారతి :

బండ్లగూడ జాగీర్ పరిధిలోని బైరాగిగూడ శివసాయినగర్ కాలనీలో రిఫ్రిజిరేటర్ కంప్రెషర్ పేలడంతో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కాలనీలోని నాలుగో లేన్‌లో ఉన్న ఓ నివాస గృహంలో ఈ ఘటన సంభవించింది. రిఫ్రిజిరేటర్ కంప్రెషర్ ఒక్కసారిగా పేలడంతో ఇంట్లో మంటలు చెలరేగి క్షణాల్లోనే ఇతర వస్తువులకు వ్యాపించాయి. దీంతో ఇంట్లో ఉన్నవారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మంటలు వేగంగా వ్యాపించడంతో ఇంట్లోని ఫర్నిచర్, ఇతర గృహోపకరణాలు పూర్తిగా మంటలకు ఆహుతయ్యాయి. ప్రమాద తీవ్రతను గుర్తించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు. సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ఈ అగ్నిప్రమాదంతో ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమై అస్తి నష్టం సంభవించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. రిఫ్రిజిరేటర్ కంప్రెషర్ పేలడమే ప్రమాదానికి కారణంగా ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల పూర్తి కారణాలపై దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం సంభవించడంతో స్థానిక కాలనీవాసులు అప్రమత్తమయ్యారు.





కరువు ప్రభావంతో నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కావలి సురేష్
- పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించాలని సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా.



విశాల భారతి ఇబ్రహీంపట్నం: దేశవ్యాప్తంగా కరువు ప్రభావంతో సాగునీరు అందక రైతులు పంటలు సాగుచేయలేక తీవ్రంగా నష్టపోతున్నారని, కరువు బారిన పడిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కావలి సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కార్యాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కావలి సురేష్ మాట్లాడుతూ సాగునీరు లేక పంటలు పండక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కరువు రైతులకు నష్టపరిహారం అందించాలని, పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించాలని, రైతులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల జిల్లా నాయకులు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు పోచమోని నీలమ్మ, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యదర్శి బండి నరసింహ, మేకల రామకృష్ణ, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ సర్కిల్‌లో రూ.2.37 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రాజేంద్రనగర్,విశాల భారతి: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. ఇందులో భాగంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ఆధ్వర్యంలో సుమారు రూ.2 కోట్ల 37 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బండ్లగూడ వార్డు గోల్డెన్ హైట్స్ కాలనీలో ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు నూతన మంచినీటి పైపులైను నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రాజేంద్రనగర్ వార్డు పరిధిలోని బుద్వేల్ బక్క డాక్టర్ గల్లీలో మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు నూతన మురుగునీటి పైపులైను నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే గోల్డెన్ హైట్స్ కాలనీతో పాటు బుద్వేల్ ప్రాంత ప్రజలకు తాగునీరు, మురుగునీటి సమస్యల నుంచి ఉపశమనం లభించనుంది. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జలమండలి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల వేతన పెంపుపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సానుకూల స్పందన

- రూ.18 వేల వేతనం అమలుకు ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్తా



రాజేంద్రనగర్, విశాల భారతి: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న ఆశ వర్కర్లు తమ వేతనాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశ వర్కర్ల నెలవారీ వేతనాన్ని రూ.18 వేలకు పెంచుతూ తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఆశ వర్కర్ల వేతనాలను రూ.18 వేలకు పెంచుతామని ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు ఆ హామీ క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని, ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆశ వర్కర్ల సమస్యలను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శ్రద్ధగా ఆలకించి, వారి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారు. ఆశ వర్కర్ల వేతనాల పెంపు అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేసి, ఆశ వర్కర్లకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ఆశ వర్కర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఈనెల 15న మల్ రెడ్డి యువశక్తి నేతృత్వంలో జాబ్ మేళా

- యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- స్నేహ అభిషేక్ రెడ్డి పిలుపు





విశాల భారతి ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మల్ రెడ్డి యువశక్తి సువర్ణ అవకాశం కల్పిస్తుందని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లక్ష్యంతో ఈ నెల 15న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని స్నేహ అభిషేక్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం 15 వ తేదీన ఇబ్రహీంపట్నంలోని ప్రజా భవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఈ జాబ్ మేళా ప్రారంభం కానుందని అన్నారు. ఆదిభట్ల కొంగరకలాన్ ప్రాంతాలలో ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీలు ఉద్యోగ నియామకాల కోసం ఈ జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పదో తరగతి ఇంటర్మీడియట్ డిగ్రీ తో పాటు వివిధ టెక్నికల్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు ఈ జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇబ్రహీంపట్నం ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక కృషితో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మల్ రెడ్డి యువశక్తి కోఆర్డినేటర్ స్నేహ అభిషేక్ రెడ్డి తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 15 గుర్తింపు ప్రూపత్రాలతో ప్రజా భవన్ కు హాజరై జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.

వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు ముందస్తు చర్యలు

- పుప్పలగూడ సబ్‌స్టేషన్‌లో నూతన 11 కేవీ ఫీడర్ ప్రారంభం

రాజేంద్రనగర్,విశాల భారతి:

రాబోయే వేసవి కాలంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగే అవకాశమున్న నేపథ్యంలో వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పుప్పలగూడ సబ్‌స్టేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 11 కేవీ విద్యుత్ ఫీడర్‌ను అధికారులు ప్రారంభించారు. ప్రస్తుతం అధిక విద్యుత్ భారంతో పనిచేస్తున్న ల్యాంకో, సెక్రటేరియట్ కాలనీ, ఎంజీ పార్క్ 11 కేవీ ఫీడర్‌పై లోడ్‌ను తగ్గించడంతో పాటు విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలనే ఉద్దేశంతో ఈ నూతన ఫీడర్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. నూతన ఫీడర్ అందుబాటులోకి రావడంతో ఆయా ఫీడర్లపై విద్యుత్ భారం తగ్గి, వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందనుంది. ఈ నూతన 11 కేవీ ఫీడర్‌ను ఇబ్రహీంబాగ్ డీఈ రమేశ్ చంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరిగినప్పటికీ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన సాంకేతిక ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగం పెరిగే ప్రాంతాలను గుర్తించి లోడ్‌ను సమతుల్యం చేయడం ద్వారా సరఫరా వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ సత్యనారాయణ రెడ్డి, ఏడీఈ కమర్షియల్స్ చరణ్, ఏఈ సంతోష్ కుమార్ తదితర విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తను కొంత ఆర్థిక సాయమందించిన స్మశానవాటికలోనే అంత్యక్రియలు

- రచయిత, ఆర్యసమాజ్ ప్రముఖులు డా.కోడూరి సుబ్బారావు కన్నుమూత
- తను కొంత ఆర్థిక సాయమందించిన స్మశానవాటికలోనే అంత్యక్రియలు
- రచయిత, ఆర్యసమాజ్ ప్రముఖులు డా.కోడూరి సుబ్బారావు కన్నుమూత

సికింద్రాబాద్, విశాల భారతి :

తెలుగునాట ఆర్య జగత్తులో సుప్రసిద్ధులు, పలు ఆర్ష గ్రంథాల కర్త 84 ఏండ్ల డాక్టర్‌కోడూరి సుబ్బారావు (సుమ్నార్థి) ఆదివారం కన్నుమూశారు. సీతాఫల్‌మండి ఆర్యసమాజం గౌరవ సభ్యుడైన ఆయన మృతిపట్ల ఆర్యసమాజ ప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం తీవ్ర విచారకరమని, పవిత్ర ఆత్మకు సద్గతి చేకూరాలని సర్వేశ్వరుడిని ప్రార్థించారు.ఆయన పార్థివ దేహాన్ని ప్రజలు, అభిమానుల సందర్శనార్థం మేడిబావి ఆర్యసమాజంలో ఉంచారు. తాను గతంలో కొంత ఆర్థిక సహాయాన్ని అందించిన సీతాఫల్‌మండి స్మశానవాటిక లోనే సోమవారం డాక్టర్‌సుబ్బారావు అంతిమ సంస్కారాలు జరిగాయి. ఈ సందర్భంగా వందలాది మంది ఆర్య సమాజ్ ప్రతినిధులు,అభిమానులు, సన్నిహితులు ఆయన అంతిమ యాత్ర లో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్య సమాజ్ ప్రెసిడెంట్ విరల్ రావు ఆర్య, ఆచార్య సవితా దేవి, ఆచార్య నీరజ, ఆనంద ప్రకాష్, హరి కిషన్, ఎంఆర్ రవీందర్, డాక్టర్ ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప పడిపూజకు కేటీఆర్‌కు ఆహ్వానం



- కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని హామీ

శేరిలింగంపల్లి - విశాల భారతి

ఈ నెల 15వ తేదీన నేతాజీనగర్‌లోని గుల్మోహర్ పార్క్‌లో నిర్వహించనున్న అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమానికి హాజరుకావాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆ పార్టీ నాయకుడు గుర్ల తిరుమలేష్ ఆహ్వానించారు. ఈ మేరకు కేటీఆర్‌ను కలిసి కార్యక్రమ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన కేటీఆర్, పడిపూజ కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు.వాకిటి శంకర్, వడ్డే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ముషీరాబాద్,విశాల భారతి:

విద్యుత్ లైన్స్ మెయింటెనెన్స్ లో భాగంగా ఈనెల 11న బుధవారం విద్యుత్ నిలిపివేత ఉంటుందని ఏడీఈ జి. నాగేశ్వరరావు ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఈ కింద ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు నారాయణగూడ, శాంతి థియేటర్, విట్టల వాడి పరిసరాలు, 11:30 నుంచి 12:30 వరకు దీపక్ థియేటర్ లైన్, కేశవ్ మెమోరియల్, జిహెచ్ఎంసి మార్కెట్, మధ్యాహ్నం 2:30 నుండి 3:30 వరకు మూన్ కేఫ్, బృందావన్ కాలనీ, రిలయన్స్ ఫ్రెష్, 4:00 గంటల నుండి 4:30 వరకు రాఘవేంద్ర టెంపుల్, శ్రీరామ్ నగర్, చారి లైన్, 4:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు సిసి స్క్రాప్, కాచిగూడ స్టేషన్ ఏరియా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని నాగేశ్వరరావు మంగళవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.

ఓజేటీ శిక్షణతో విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాల వికాసం

- క్రమ-శిక్షణతో శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: చైర్మన్ మోజేష్, డీఐఈఓ మదర్ గౌడ్



మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: శ్రీ చైతన్య ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఓజేటీ (OJT) క్యాంపింగ్ సెరిమనీ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ పల్లె తిరుమలేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ చల్లగాలి మోజేష్, మహబూబాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సీహెచ్. మదర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ చల్లగాలి మోజేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు శిక్షణా కార్యక్రమాలను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలని, వాటి ద్వారా తమలోని ప్రతిభను వెలికితీసి వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సీహెచ్. మదర్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో ప్రతిరోజూ ఓజేటీ శిక్షణా కార్యక్రమాలకు హాజరుకావాలని, నిరంతర సాధనతో మెరుగైన నైపుణ్యాలను అలవర్చుకోవాలని అన్నారు. మంచి నడవడిక, క్రమశిక్షణ, అంకితభావంతో శిక్షణను విజయవంతం చేసి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంగ్లీష్ అధ్యాపకులు ఎం. శ్రీనివాస్ రెడ్డి, జీఎఫ్ఈ అధ్యాపకులు సీహెచ్. ప్రసాద్, అధ్యాపకులు అరుణ, లిఖిత, యమునతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఓయూలో నాన్ టీచింగ్ ఉద్యోగుల మహాధర్నా

- ఓపీఎస్ అమలు చేయాలి.. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ముషీరాబాద్,విశాల భారతి: ఉస్మానియా యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం పరిపాలనా భవనం ఎదుట మంగళవారం మహాధర్నా నిర్వహించారు. పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, అంతర్గత పదోన్నతులు కల్పించాలని, ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్ బకాయిలు, వైద్య ఖర్చులు వెంటనే చెల్లించాలని కోరారు. ధర్నాకు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, ఎంపీ ఈటెల రాజేందర్, టీఆర్ఎస్ చీఫ్ కవిత, జాన్ వెస్లీ, బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినా యూనివర్సిటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. శాశ్వత ఉద్యోగులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం కలిసి పోరాడటం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ మనోహర్ సస్పెన్షన్‌ను ఉపసంహరించుకుని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీకి ప్రకటించిన రూ.1,000 కోట్ల నిధులు విడుదల చేయాలని, ఉద్యోగుల సమస్యలపై వైస్ ఛాన్సలర్, గవర్నర్ స్పందించాలని కోరారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు ఖాదీర్, వెంకటేష్, నాగరాజ రావు, అక్బర్, పవన్, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత నారాయణరెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

- కూనంనేని సాంబశివరావు సహకారంతో రూ.1.75 లక్షల ఆర్థిక సాయం



విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ గ్రామానికి చెందిన సీపీఐ పార్టీ మండల కార్యవర్గ సభ్యులు సీహెచ్ నారాయణరెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.1,75,000 ఆర్థిక సాయం అందింది. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో మంజూరైన ఈ నిధులకు సంబంధించిన చెక్కును సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ కలిసి నారాయణరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పార్టీ శ్రేణులకు, ప్రజలకు అండగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు సహకరించిన కూనంనేని సాంబశివరావుకు నారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అట్లాంటాలో అంబరాన్నంటిన దీపావళి సంబరాలు

- స్వామి నారాయణ్ టెంపుల్‌లో ప్రత్యేక పూజలు



సికింద్రాబాద్, విశాల భారతి : అమెరికాలోని జార్జియా రాష్ట్రం అట్లాంటా నగరంలో నివసిస్తున్న ప్రవాస తెలుగు ప్రజలు దీపావళి పండుగను అత్యంత వైభవంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. నగరంలోని ప్రసిద్ధ స్వామినారాయణ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ప్రవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని, లక్ష్మీదేవికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రకరకాల బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ప్రవాస మహిళ మలత్కర్ దీపిక రాజ్ మాట్లాడుతూ..తాము గత కొన్నేళ్లుగా అట్లాంటాలో దీపావళిని ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఇక్కడి స్వామినారాయణ ఆలయ వాతావరణం ఎంతో అద్భుతంగా ఉందని, విదేశాల్లో ఉన్నప్పటికీ స్వదేశంలో పండుగ చేసుకున్న అనుభూతి కలిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ వేడుకల్లో స్థానిక తెలుగు కుటుంబాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి.

పెళ్లికి వేళయింది?

న్యూస్ రీడర్‌గా కెరీర్‌ను మొదలుపెట్టి అనంతరం సినీరంగంలో అడుగుపెట్టి విజయాల్ని అందుకుంది కథానాయిక ప్రియా భవానీ శంకర్. తమిళ ప్రేక్షకులకు సుపరిచితురాలైన ఈ భామ 'ఇరుముడి' చిత్రంతో తెలుగువారికి కూడా చేరువైంది. తాజా సమాచారం ప్రకారం ఈ సొగసరి పెళ్లిపీటలెక్కబోతున్నట్లు తెలుస్తున్నది. ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ప్రియుడు రాజవేల్ రాజన్‌తో కలిసి తీయించుకున్న ఫొటోలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఫొటోల్లో సంప్రదాయ దుస్తుల్ని ధరించిన ఈ జంట మెడలో మల్లెపూల దండలు, నుదుటిపై చందనం బొట్లు పెట్టుకొని కనిపిస్తున్నారు. వీటిని చూసిన అభిమానులు ప్రీ వెడ్డింగ్ వేడుక ఏమైనా జరిగిందా? త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారా? అని ప్రశ్నిస్తున్నారు. అయితే తమ వివాహంపై ప్రియా భవానీశంకర్, రాజవేల్ రాజన్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాలేజీ రోజుల నుంచే ఈ జంట ప్రేమలో ఉన్నారని, గత కొంతకాలంగా సహజీవం సాగిస్తున్నారని సమాచారం. ప్రియా భవానీ శంకర్ ప్రస్తుతం 'డిమోంటే కాలనీ3'లో నటిస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.